
ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
19-10-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 44 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

# అధికారం కోసం కాదు రాష్ట్రం, దేశం కోసం పని చేసింది



- ఐదేళ్లలో గత పాలకులు అన్ని వ్యవస్థలను నాశనం చేశారు
- దోచుకున్న సొమ్మును బస్తాల కొద్దీ ఖర్చు చేసినా గెలవలేకపోయారు
- చరిత్రలో లేని విధంగా కక్ష సాధింపులకు పాల్పడ్డారు
- మనం క్రమ శిక్షణగా ఉందాం...ప్రజల నమ్మకాన్ని నిలబెడదాం
- రోడ్లపై వాళ్లు గోతులు పెట్టెళ్లారు...మనం పూడ్చుతున్నాం
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు గురించి ధైర్యంగా చెప్పండి
- ప్రజలు మనల్ని అనుమానించే పరిస్థితి రాకూడదు...
- ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ ముఖ్యం
- కార్యకర్తలకు అండగా ఉండాలి... న్యాయం చేయాలి
- ఇసుక, లిక్కర్ లో ఎవరూ జోక్యం చేసుకోవద్దు...
- వైసీపీ నేతలు చేసిన తప్పులు మీరూ చేయొద్దు
- పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతల సమావేశంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు

టీడీపీ ఏనాడూ పదవుల కోసం పని చేయలేదు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. అత్యంత శక్తివంతమైన పార్టీగా ఆవిర్భవించింది. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టీడీపీ కీలక పాత్ర పోషించింది' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇంఛార్జులు, ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై నేతలకు దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మట్లాడుతూ..."125 రోజుల పాలనలో మనం చేసిన మంచి పనులు సమీక్షించుకుని ముందుకెళ్లాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎన్డీయే అధికారంలో ఉంది. మొన్నటి ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేశాయి. పార్టీని సమన్వయం చేసుకోవడంతో పాటు మద్దతు ఇచ్చిన ప్రజల ఆశలు నెరవేర్చాలి. గత ఐదేళ్లు కార్యకర్తలు అన్ని విధాలా నష్టపోయి, త్యాగాలు చేసి కష్టపడ్డారు.

2 లో



## ఆకస్మాత్తుగా బ్లడ్ ప్రెజర్ రతన్ టాటా మరణం

జయభేరి, ముంబై, అక్టోబరు 18:

రతన్ టాటా మరణం టాటా గ్రూప్‌నకే కాదు, యావత్ దేశానికీ కచ్చితంగా లోటే. దేశంలోనే అత్యంత విలువైన వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి, వేల కోట్ల ఆస్తిపరుడు అయిన రతన్ నావల్ టాటా నిశ్చయంగా నిగర్వి, నిరాడంబరుడు, మేధావి, అసమాన నాయకుడు, మార్గదర్శి. వ్యాపారవేత్తగా ఉన్నప్పటికీ, నిరంతరం జన శ్రేయోభిలాషిగానే బతికారు. తనను విమర్శించిన వాళ్లకు కూడా మేలు చేసి అజాతశత్రువులా నిలిచారు. మనసా, వాచా, కర్మణా మహోన్నతుడైన రతన్ టాటా, 86 ఏళ్ల వయసులో ...

2 లో



## ఇండియా కూటమికి మోది స్ట్రాంగ్ మేసేజ్

భారత దేశ చరిత్రలో సెన్సేనల్ సృష్టించిన ప్రధాని మోది సంచలనాత్మక బిల్లులే గెలుపుకు నాంధి..

కేంద్రంలో మూడవసారి వరసగా ప్రధాని సీట్లో కూర్చోవడం అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. అది ఒక రికార్డు, ఇండియన్ పాలిటిక్స్ ని చూసిన వారికి అధ్యయనం చేసిన వారికి ఇది ఒక వండర్ అని కూడా చెప్పాలి. ఎపుడో గాంధీల కుటుంబం నుంచి వరసగా ప్రధానులు అయ్యారు అంటే ఆ రోజులు వేరు. ఆ రాజకీయాలు వేరు. ఆ పరిస్థితులు వేరు. అప్పట్లో భారతదేశంలో సామాజిక పరిస్థితులు కూడా వేరు. కానీ ఈ సోషల్ మీడియా యుగంలో ఒక మనిషిలోనే వంద అలోచనలు ఉన్న వేళ ఎన్నో ఆశలతో ప్రతీ వారూ ఉంటున్న వేళ పాలిటిక్స్ అంటేనే పవర్ అన్నది పూర్తిగా ఒక ఒపీనియన్ ఏర్పడిన తరువాత కుర్చీ కోసం ఏమైనా చేయవచ్చు అన్నది ఒక సెటిల్డ్ స్టేట్మెంట్ గా మారిన వేళ మోడీ మళ్ళీ ప్రధాని కావడం అంటే అద్భుతం అనాల్సిందే. దేశంలో 143 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. వారిలో ఏ కోటానుకోట్ల మందిలో ఒకరికి ప్రధాని అయ్యే చాన్స్ వస్తుంది. అది కూడా ఒక్క రోజు సీటు ఎక్కినా జన్మ ధన్యమే అనుకునే వారు ఉన్నారు.

## ఫుట్ పాత్ లపై హైడ్రా గురి



జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:


హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్ విభాగంతో కలిసి పని చేయాలని నిర్ణయించింది హైడ్రా. ట్రాఫిక్ సమస్యకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కూడా ఓ కారణంగా భావిస్తున్న హైడ్రా.. ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసింది...

త్వరలోనే ఆపరేషన్ ఫుట్ పాత్‌ను స్టార్ట్ చేయనుంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాద్ సమావేశమయ్యారు. ట్రాఫిక్ సమస్య సహా ఫుట్ పాత్ ఆక్రమణలపై చర్చించారు. ఎక్కడెక్కడ ఫుట్ పాత్‌లు ఆక్రమణలకు

...మిగతాది 2 లో

## ఫోన్ టాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

- రెండు వర్గాలుగా చీలిపోయిన పోలీసులు



జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:

సంచలనం రేపిన ఫోన్ టాపింగ్ కేసు ఇప్పుడు సైలెంట్ అయిపోయింది. కొత్త ప్రభుత్వం ఈ నేరానికి పాల్పడిన వారిని వదిలిపెట్టమని చర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపిస్తామని హెచ్చరించినా.. ఆ కేసులో మాత్రం ముందడుగు పడటం లేదు. ఆ ఫైలుకు బూజు పట్టిందని పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా చర్చ నడుస్తోంది. మొన్నటి వరకు దర్యాప్తులో రోజుకో కొత్త అంశంతో హల్ చల్ చేసిన పోలీసులు.. ఇప్పుడు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్లు, అరెస్టైన పోలీసు అధికారుల వాంగ్మూలాలతో గత

...మిగతాది 2 లో

## సిద్ధప్పకు బిగిస్తున్న ఉచ్చు



జయభేరి, బెంగళూరు, అక్టోబరు 18:

ఈడి అధికారులు కర్ణాటకలోని మైసూరు డెవలప్మెంట్ అథారిటీ (ముడా) ఆఫీసలు శుక్రవారం తనిఖీలు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు ముడా భూముల్లో కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారని.. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందని ఆరోపణలు రావడంతో 12 మంది ఈడీ అధికారుల బృందం.. మైసూరులోని ముడా ఆఫీసుతో పాటు పలు చోట్ల తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో ముడా కమిషనర్ రఘునందన్ తో పాటు స్పెషల్ ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసుకు చెందిన పలువురు అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆఫీసుల్లోని పలు కీలక ఫైల్స్‌ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ అధికారులందరికీ ముడా భూకుంభకోణంలో పాత్ర ఉందని అధికారులు అనుమానిస్తున్నట్లు జాతీయ మీడియా తెలిపింది.

...మిగతాది 2 లో



## కోర్టుకు కేసీఆర్ డుమ్మా

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:

బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ మరోసారి కోర్టుకు డుమ్మా కొట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయి వేల కోట్ల రూపాయల

...మిగతాది 2 లో

## చంద్రబాబును కలిసిన ఐఏఎస్ అధికారులు

- పవన్ శాఖల్లోకి ఆమ్రపాలి



జయభేరి, విజయవాడ, అక్టోబరు 18:

ఏపీలో రిపోర్ట్ చేసిన నలుగురు ఐఏఎస్ అధికారులు ఇవాళ చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందే కేంద్రం, డీఓపీటీ ఆదేశాలతో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కూటమికి మోదీ స్ట్రాంగ్ మేసేజ్

ఆ టైం లో ఏకంగా పదేళ్ళ పాటు భారత్ వంటి విభిన్న దృక్పథం కలిగిన దేశాన్ని ఏలడం మరో సారి ఆ చెయిర్ లోకి రావడం మోడీకి మాత్రమే సాధ్యమైన టాస్క్. దానికి గాను ఆయన నమ్ముకున్నది ఎన్డీయే మిత్రులను. మోడీ ప్రధాని అయ్యాక ఎన్డీయేని పక్కన పెట్టారని పట్టించుకోవడం లేదని వచ్చిన అనేక ఆరోపణలకు విమర్శలకు తాను థర్డ్ టైం ప్రధాని కావడం ద్వారా మోడీ చెక్ పెట్టేశారు. ఇక మోడీ ప్రధానిగా ఎన్నాళ్ళు ఉంటారు అని ఆయన గద్దెనెక్కిన మరుసటి రోజు నుంచే ప్రచారం మొదలైంది. జోస్యాలు చెప్పేవారూ అధికం అయ్యారు. కూలిపోయే ప్రభుత్వం అంటున్న నేపథ్యం ఉంది. బీహార్ సీఎం నితీష్ కుమార్ ని చూపించి ఎన్డీయే స్థిరత్వం మీద డౌట్లు పెంచే వారూ ఉన్నారు. ఇక హర్యానా జమ్మూ కాశ్మీర్ లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక ఫలితాలు వస్తాయని దాని తరువాత కేంద్రంలో భారీ రాజకీయ కుదుపు ఉంటుందని కూడా ఊహించారు. అయితే కాశ్మీర్ లో ఓడినా గతం కంటే సీట్లూ ఓట్లూ ఎక్కువ తెచ్చుకుని బీజేపీ తన ఆశలని అక్కడ సజీవం చేసుకుంది. ఇక ఓటమి తప్పదు అనుకున్న హర్యానాలో వరసగా మూడోసారి గెలిచి రాజకీయ పండితులను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ నేపథ్యంలో ఎక్కడైతే ఇండియా కూటమికి షాక్ తినిపించి థర్డ్ టైం పవర్ దక్కించుకుందో అక్కడే ఎన్డీయే మిత్రులతో మోడీ ఒక కీలక భేటీని ఏర్పాటు చేశారు. ఈ భేటీకి ఎన్డీయేకు చెందిన 13 మంది ముఖ్యమంత్రులు అలాగే 16 మంది ఉప ముఖ్యమంత్రులు కీలక నేతలు హాజరయ్యారు. ఎన్డీయే మిత్ర పక్షాలకు చెందిన కేంద్ర మంత్రులు కూడా అటెండ్ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ దేశంలో పేదలు బడుగుల అభివృద్ధి కోసం ఎన్డీయే పనిచేస్తోందని అన్నారు. ఎన్డీయే పాలన ద్వారా అన్ని వర్గాలకు సాధికారత కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశం ద్వారా ఎన్డీయే ఐక్యతను మోడీ చాటినట్లు అయింది. అంతే కాదు ఎన్డీయే పటిష్టంగా ఉందని కూలిపోయే పేకమేడ కాదని ఇండియా కూటమికి చెప్పినట్లు అయింది అంటున్నారు. ఇదే ఊపుతో రానున్న మహారాష్ట్ర జార్ఖండ్ ఎన్నికల్లో గెలవడంతో పాటు డిసేంబర్ లో జరిగే శీతాకాల సమావేశాల్లో కీలకమైన బిల్లులను ప్రవేశ పెట్టి నెగ్గించుకుంటామన్న ధీమాను కూడా వ్యక్తం చేసినట్లు అయింది. ఇకపోతే హర్యానా కాశ్మీర్ లో ఒడ్డున పడిన బీజేపీకి మహారాష్ట్ర, జార్ఖండ్ టఫ్ టాస్క్ గానే ఉన్నాయి. అయితే తనకు ఉన్న చతురతతో గెలుచుకుని చూపించాలని కూడా చూస్తోంది. అంతే కాదు ఎన్డీయే అంతా ఒక్కటి అన్న మేసేజ్ ని పంపడం ద్వారా ఇండియా కూటమిని డీలా చేయాలని కూడా మాస్టర్ ప్లాన్ ఉంది అని అంటున్నారు. మొత్తానికి హర్యానాలో మోడీ దాదాపుగా ఒక రకమైన బల ప్రదర్శన చేశారు అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

## బ్లడ్ ప్రెజర్.. రతన్ టాటా మరణం

శాశ్వతంగా సెలవు తీసుకున్నారు.రతన్ టాటా మరణానికి ముందు, అక్టోబర్ 7న, నేషనల్ మీడియా నివేదికల ప్రకారం, ప్రముఖ పారిశ్రామికవేత్త & టాటా గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ టాటా "లో బ్లడ్‌ప్రెజర్"తో బాధపడ్డారు. చికిత్స కోసం ఆయన్ను ముంబయిలోని బ్రీచ్ కాండీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ICUలో రతన్ టాటాను అడ్మిట్ చేశారు. అయితే, అదే రోజున, సోషల్ మీడియా పోస్ట్ లో, ఆ వార్తలను రతన్ టాటా తోసిపుచ్చారు. కేవలం వయస్సు సంబంధిత ఆరోగ్య సమస్యల కారణంగా ముంబై ఆసుపత్రిలో చేరానని, తాను బాగానే ఉన్నానని X పోస్ట్ లో చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తన గురించి ఆలోచించినందుకు అందరికీ ధన్యవాదాలు అని రాశారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం మానుకోవాలని ఆయన ప్రజలను, మీడియాను కోరారు. విషాదం ఏంటంటే, ఇది జరిగిన రెండు రోజులకే రతన్ టాటా మరణించారు. రతన్ ఎన్ టాటా (86), బుధవారం (09 అక్టోబర్ 2024) రాత్రి 11.30 గంటల సమయంలో, ముంబైలోని బ్రీచ్ కాండీ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన మరణవార్త యావత్ దేశాన్ని కుదిపేసింది. టాటా గ్రూప్ ఉద్యోగులు, అభిమానులు, ఆయన నుంచి సాయం పొందినవాళ్లు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన చేరదీసిన శునకం కూడా మౌనంగా నివాళి అర్పించింది. రతన్ టాటా మృతిపై దేశ & అంతర్జాతీయ ప్రముఖులు స్పందించారు. అసమాన నాయకుడిని & మారదర్శిని కోల్పోయామంటూ బాధను వ్యక్తం చేశారు.

**రతన్ టాటా ఎలా చనిపోయారు, ఆయన మరణానికి అసలు కారణం ఏంటి?**

రతన్ టాటా చనిపోవడానికి రెండు రోజుల ముందు, అక్టోబర్ 7 నాటి మీడియా కథనాలే చివరకు నిజమయ్యేలా ఉన్నాయి. వయస్సు సంబంధిత ఆరోగ్య సమస్యలకు లో బ్లడ్‌ప్రెజర్ తోడవడం వల్ల ఆయన చనిపోయినట్లు వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు.తక్కువ రక్తపోటును హైపోటెన్షన్ అని కూడా పిలుస్తారు. ఇదొక తీవ్రమైన ఆరోగ్య సమస్య. ఇతర ప్రాణాంతక పరిస్థితులకు ఇది కారణమవుతుంది, ముఖ్యంగా పెద్దల్లో ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తుంది. దీనిని 'సైలెంట్ కిల్లర్' అని కూడా పిలుస్తారు. ఎందుకంటే, ఈ పరిస్థితిని సాధారణంగా గుర్తించలేరు. హైపోటెన్షన్‌కు చికిత్స చేయకుండా వదిలేస్తే, ఇతర ఆరోగ్య సమస్యలను సృష్టిస్తుంది.అకస్మాత్తుగా BP పడిపోయినప్పుడు శరీరంలో అసలు ఏం జరుగుతుందో మనకు అర్థమవుతుంది. హై బీపీ లాగానే, రక్తపోటులో అకస్మాత్తుగా తగ్గుదలను (లో బీపీ) కూడా సమయానికి నియంత్రించాలి. లేకపోతే అది ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉంది.

**రక్తపోటులో ఆకస్మిక తగ్గుదల ఇలాంటి లక్షణాలకు దారి తీస్తుంది:**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, చాలా తక్కువ సందర్భాల్లోనే రక్తపోటులో అకస్మాత్తుగా తగ్గుదల ప్రాణాంతకం కావచ్చు. ఎందుకంటే, ఇది మెదడు సహా శరీరంలోని ఇతర కీలక అవయవాలకు ఆక్సిజన్ అందకుండా చేస్తుంది. తద్వారా హార్ట్ స్ట్రోక్ (గుండెపోటు) వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది.

## ఫోన్ టాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు అరెస్టు ఖాయమని సంకేతాలు ఇచ్చినా ఆ దర్యాప్తులోని అంశాలన్నీ ఇప్పుడు తుస్సుమన్నాయని పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ఇదంతా కేవలం ఆఫీసర్స్ రెండు వర్గాలుగా చీలిపోవడంతో ఫోన్ ట్యాపింగ్ కేసును నీరుగారుస్తున్నారని పోలీసు వర్గాల్లోని కొందరు బడా ఆఫీసర్లు చెవులు కొరుక్కొంటున్నారు. కొంతమంది అధికారులు గత ప్రభుత్వంలోని పెద్దలతో పాటు ఈ కేసులో కీలకంగా ఉన్న నిందితుడు ప్రభాకర్ రావుకు దర్యాప్తుకు సంబంధించి ప్రతి కదలికను చేరవేస్తున్నట్లు ప్రచారం ఉంది. ఇలా దర్యాప్తు అధికారుల మూవ్ మెంట్ తెలుసుకుని ప్రభాకర్ రావు పోలీసు అరెస్టు నుంచి తప్పించుకుంటూ టైంపాస్ చేస్తున్నాడని పోలీసు వర్గాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో అధికారులు పూర్తి ఆధారాలు సేకరించి.. ఓ ఎమ్మెల్సీ అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి అతనికి లుక్ ఔట్ నోటీసులు కూడా ఇచ్చారు. ఇక అరెస్టుకు రెడీ అవుతున్న సందర్భంలో ఓ కీలక ఐపీఎస్ అధికారి పావులు కదపడంతో అరెస్టుకు బ్రేక్ పడింది. అంతే కాకుండా హైదరాబాద్ యూనిట్ లో కీలకాధికారిగా ఉన్న ఆఫీసర్‌ను ఏకంగా బదిలీ చేయించేశారని పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి. దీని కోసం కొంత మంది ఉన్నతాధికారులు రెండు గ్రూపులుగా విడిపోయినట్లు తెలిసింది. ఫోన్ టాపింగ్ కేసును అటకెక్కించేందుకు ఓ వర్గం పోలీసు అధికారులు ఏకంగా ప్రభుత్వ పెద్దలను భయాందోళనకు గురిచేసి కలవరానికి గురి చేశారనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా ఫోన్ టాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారినే బదిలీ చేసేందుకు స్కెచ్ వేశారని పోలీసు వర్గాల్లో మరో చర్చ మొదలైంది. ప్రభుత్వం కూడా ఓ వర్గం ఆఫీసర్‌ల మాటలు విని తాత్కాలికంగా ఈ దర్యాప్తును ఆపేసిందని సమాచారం. ఈ నేపథ్యంలోనే సదరు ఎమ్మెల్సీ సురక్షితంగా బయటపడ్డాడనే అభిప్రాయం ఇప్పుడు పోలీసు వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురు పోలీసులు అరెస్టు కాగా.. మరికొందరు నోటీసులు అందుకున్నారు.ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు అరెస్టుకు అవకాశం ఉన్నా దర్యాప్తును సైలెంట్ కావడంతో కేసు నీరుగారిపోయింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేసిన ఉన్నతాధికారి ఢిల్లీలో సీబీఐ, ఆ తర్వాత ఇంటర్ పోల్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రభాకర్ రావు అరెస్టుకు మొత్తం ప్రణాళిక రూపొందించుకున్నారు. ప్రభాకర్ రావుకు అమెరికాకు సంబంధించిన వీసాలోని షరతుల కారణంగా ఆరు నెలల తర్వాత అతను ఒకసారి ఆ దేశం నుంచి మరో దేశానికి ప్రయాణించాల్సిన అవసరం ఉంది. ఆ సమయంలో అతను విమానాశ్రయం రాక తప్పదు, ఆ సమయంలో రెడ్ కార్నర్ నోటీసును జారీ చేయించి అరెస్టుకు పక్కా స్కెచ్ వేసుకోగా ఓ వర్గం పోలీసు అధికారుల గందరగోళ వ్యవహారంతో దర్యాప్తుకు ఆటంకం కలగడంతో ప్రభాకర్ రావు అరెస్టు ఛాన్స్ మిస్సయ్యిందని పోలీసు వర్గాలు అంటున్నాయి. ఈ ఫోన్ టాపింగ్ కేసుతో సీనియర్ పోలీసు ఉన్నతాధికారుల మధ్య కోల్డ్ వార్ మొదలైందని అది ఎక్కడికి దారి తీస్తోందో అని పోలీసు వర్గాల్లో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు కాకపోయినా రిటైర్ అయినా తర్వాత ఈ ఫోన్ టాపింగ్ కేసు డెడ్ అంశాలపై అధికారులు గళంవిప్పే అవకాశం ఉందని పోలీసు వర్గాలు అంటున్నాయి.

# అధికారం కోసం కాదు

# రాష్ట్రం, దేశం కోసం పని చేసింది

**టీడీపీ ఏనాడూ పదవుల కోసం పని చేయలేదు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. అత్యంత శక్తివంతమైన పార్టీగా ఆవిర్భవించింది. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టీడీపీ కీలక పాత్ర పోషించింది' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇంఛార్జులు, ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై నేతలకు దిశనిర్ధేశం చేశారు.**



**జయభేరి, అమరావతి :**

మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు,ఎంపీలు,ఎమ్మెల్సీలు,ఇంఛార్జులు,ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై నేతలకు దిశనిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మట్లాడుతూ..."125 రోజుల పాలనలో మనం చేసిన మంచి పనులు సమీక్షించుకుని ముందుకెళ్లాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎన్డీయే అధికారంలో ఉంది. మొన్నటి ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేశాయి. పార్టీని సమన్వయం చేసుకోవడంతో పాటు మద్ధతు ఇచ్చిన ప్రజల ఆశలు నెరవేర్చాలి. గత ఐదేళ్లు కార్యకర్తలు అన్ని విధాలా నష్టపోయి, త్యాగాలు చేసి కష్టపడ్డారు. కార్యకర్తలు, నేతలు గత ఐదేళ్లలో పడ్డ ఇబ్బందులు ఎప్పుడూ చూడలేదు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ఏ విభాగంలోనూ ఆడిట్ చేయలేదు. కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించారు. ఇప్పుడు నిధులు అడుగుతుంటే గతంలో ఇచ్చిన నిధులకు యూసీలు అడుతున్నారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన రూ.990 కోట్లు మళ్లించారు...దీంతో రూ.12 వందల కోట్లు రాకుండా పోయాయి. మనం వచ్చాక రూ.990 కోట్లు చెల్లించడం వల్ల రూ.12 వందల కోట్లు పంచాయతీలకు రాబోతున్నాయి. ఇవన్నీ గమనించిన రాష్ట్ర ప్రజలు నిర్ణయం తీసుకుని మనకు పెద్ద మెజారిటీ ఇచ్చారు. టీడీపీ కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీ కాదు... పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చాం. దేశ రాజకీయాల్లో టీడీపీ కీలక పాత్ర పోషించింది. దేశ రాజకీయాల్లో కీలక సమయాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించింది. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ద్వారా ప్రభుత్వాలను ఏర్పాటు చేశాం. ఎలాంటి పదవులు ఆశించకుండా వాజ్ పేయ్ ప్రభుత్వంలో పని చేశాం. టీడీపీ ఒక విశ్వసనీయత కలిగిన పార్టీ. దేశం కోసం, రాష్ట్రం కోసం మాత్రమే పని చేసింది. ఒక నాయకుడికి, పార్టీకి విశ్వసనీయత రావాలంటే ఎంతో సమయం పడుతుంది... దాన్ని పడగొట్టుకోవాలంటే తక్కువ సమయం చాలు. అది నాకైనా మీకైనా. ప్రతి ఒక్కరం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేద్దాం.' అని పిలుపునిచ్చారు.

**ప్రధాని మోదీ పట్టుదల, కృషి అందరికీ ఆదర్శనీయం**

'ప్రధాని మోదీని చూసి నేర్చుకోవాల్సింది ఆయనకున్న పట్టుదల,కృషి. 3 సార్లు ప్రధాని అయినా మళ్లీ రాబోయే ఎన్నికల గురించి ఆలోచిస్తున్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్నారు. దేశంలో ఎవరికీ రాని విజయం మోదీ సాధించారంటే దాని వెనక కఠోరమైన శ్రమ, క్రమశిక్షణ ఉంది. పార్టీలో ఎవరూ తప్పు చేయకుండా చూసుకుంటున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లు అరాచకం జరిగింది..దీంతో అంతా ఇబ్బంది పడ్డారు, బాధలు పడ్డారు. నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. ఆ సమయంలో పవన్ కళ్యాణ్ నన్ను కలిసిన అనంతరం కలిసిపోటీ చేస్తామని ప్రకటించారు. బీజేపీ కూడా కలిసి పోటీ చేయడానికి ముందుకు వచ్చింది. ఎన్నికల్లో పొలిటికల్ సోషల్ రీ ఇంజనీరింగ్ చేశాం. టీడీపీకి అండగా ఉన్న బీసీలకు ప్రాధాన్యం ఇచ్చాం. ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాని వర్గాలకు సీట్లు ఇచ్చాం. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలబడాలి అని నినాదం ఇచ్చాం. ఇప్పుడు గెలిచాం కాబట్టి మన పని అయిపోయిందని అనుకోకూడదు పార్టీ నమ్ముకున్న వారికి కూడా పొత్తు వల్ల సీట్లు ఇవ్వలేకపోయాం. 65 మంది కొత్త ఎమ్మెల్యేలు వచ్చారు. యువత, చదువుకున్నవారు వచ్చారు. 18 మంది కొత్త మంత్రులు ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు 80 మంది దాకా కొత్తవారు ఉన్నారు. పార్టీ కూడా కుటుంబం లాంటిదే. సమస్యలను పరిష్కరించుకుని ముందుకెళ్లాలి. అనుకున్న ఆశయం కోసం మనం పని చేయాలి. వైసీపీ చేయని తప్పు లేదు. ప్రజల్ని బెదిరించారు... అన్ని విధాలా దందాలకు పాల్పడ్డారు. అందుకే ప్రజలు 151 సీట్ల నుండి 11 సీట్లకు కుదించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన దౌర్జన్యాలు, బెదిరింపులను తట్టుకుని నిలదొక్కుకున్నాం...ఎదిరించాం.. అండగా ఉన్నాం. అందుకే చరిత్రలో లేని విధంగా 93 శాతం స్ట్రైక్ రేట్ తో సాధించాం. మన ప్రభుత్వంలో కక్షసాధింపులు ఉండవు... అలాగని తప్పు చేసిన వారిని వదిలిపెట్టం. గత ప్రభుత్వం మాదిరి కక్ష సాధింపులకు పాల్పడితే మనకూ వారికి తేడా ఉండదు. టీడీపీకి కొన్ని కుటుంబాలు అంకితం అయ్యాయి... ప్రాణాలకు పణంగా పార్టీ కోసం పని చేశారు.'

> 'ప్రధాని మోదీని చూసి నేర్చుకోవాల్సింది ఆయనకున్న పట్టుదల, కృషి. 3 సార్లు ప్రధాని అయినా మళ్లీ రాబోయే ఎన్నికల గురించి ఆలోచిస్తున్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్నారు. దేశంలో ఎవరికీ రాని విజయం మోదీ సాధించారంటే దాని వెనక కఠోరమైన శ్రమ, క్రమశిక్షణ ఉంది. పార్టీలో ఎవరూ తప్పు చేయకుండా చూసుకుంటున్నారు.

**క్రమ శిక్షణగా ఉందాం... ప్రజల నమ్మకాన్ని నిలబెడదాం**

'సంఘటిత శక్తిగా ఏర్పడి మంచిపని చేస్తేనే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలి. ప్రభుత్వంలో చివరి ఉద్యోగి తప్పు చేసినా సీఎంను అంటారు. ఎన్డీయేలో ఏ కార్యకర్త తప్పు చేసినా అది సీఎం వైపే చూపెడతారు. పార్టీ, ప్రభుత్వం నుండి తలెత్తేవి నావైపే చూపిస్తారు. మీరు మంచి చేసినా, తప్పు చేసినా అవి పార్టీ, ప్రభుత్వానికి వర్తిస్తాయి. అందరికీ ఒకటే చెప్తున్నా...మనం ప్రవర్తించే ప్రధానమే మనకు వచ్చే మెజార్టీపై ఆధారపడి ఉంటుంది. ఈ నాలుగు నెలల పనితీరు ప్రోగ్రెస్ కూడా నా వద్ద ఉంది. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసంతో ప్రజలకు వాస్తవాలు చెప్పాలని 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. అమరావతి, పోలవరం, విద్యుత్, మద్యం, ల్యాండ్ మాఫియా, లా అండ్ ఆర్డర్, ఆర్థిక వ్యవస్థపై ప్రజలకు పరిస్థితిని వివరించాం. గత ప్రభుత్వంలో మద్యం, ఇసుకను, గనులు ఇష్టారీతిన దోచేశారు. గంజాయి విపరీతంగా విక్రయించారు. ఎన్నో అత్యాచారాల వెనక గంజాయి మత్తే కారణం. రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారు. యేటా రూ.90 వేల కోట్లు వడ్డీలు చెల్లించాలి. భవిష్యత్ బాగుండాలంటే ఎన్డీయే ఉండాలని ప్రజలు విశ్వసించారు. మనపై ఉండే నమ్మకం, పవన్ కళ్యాణ్ పట్ల ఉన్న విశ్వాసం, కేంద్రం నుండి రాష్ట్రాన్ని కాపాడుతుందన్న నమ్మకంతోనే ప్రజలు గెలిపించారు.' అని గుర్తు చేశారు.

**దోచుకున్న సొమ్మును బస్తాల కొద్దీ ఖర్చు చేసినా గెలవలేకపోయారు**

'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలిస్తామని చెప్పాం...ఆ విధానం ప్రారంభమైంది డిసెంబర్ నాటికి పూర్తవుతుంది. దాదాపు 70 శాతం గ్రీవెన్స్ నాకు భూ సమస్యలపైనే వస్తున్నాయి. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. యాక్ట్ రాకముందే ఇలా జరిగిదంటే వస్తే ఇంకేలా ఉండేదో ఆలోచించాలి. పట్టాదారు పుస్తకంపైనా వారి బొమ్మలు వేసుకున్నారు. హద్దులు మించి ప్రవర్తించారు. పింఛన్లు ఇచ్చిన మాట ప్రకారం రూ.1000 పెంచి ఇస్తున్నాం. రూ.6 వేలు దివ్యాంగులకు, రూ.10 వేలు కిడ్నీ బాధితులకు, పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. అన్నక్యాంటీన్లను 175 ప్రారంభించాం... 203కు పెంచుతాం. ప్రతి నియోజకవర్గంలో ఒక క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం. నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టాం. స్కిల్స్ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం. 1వ తేదీనే ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు అందిస్తున్నాం. గత మద్యం విధానంలో జరిగిన దోపిడీపై విచారణ చేస్తూనే నూతన మద్యం పాలసీని తెచ్చాం. నూతన ఇసుక పాలసీ తెచ్చాం. అవతలి వారు చేసిన తప్పులు మనం చేస్తే ప్రజలు అనుమానిస్తే పార్టీ ఇమేజ్ దెబ్బతింటుంది. వారసత్వంగా వస్తున్న వ్యాపారం చేసుకుంటే ఏమీ కాదు... కానీ జోక్యం చేసుకుంటే ప్రతిష్ట దెబ్బతింటుంది. వైసీపీ నేతలు బస్తాలు బస్తాలు డబ్బులు దోచుకున్నారు. కోట్లు ఖర్చు పెట్టారు...కానీ గెలిచారా.? నమ్మకం లేకపోతే డబ్బుతో ఏ ఎన్నిక జరగదు. డబ్బులతో ఎన్నికలు జరిగితే 93 శాతం సీట్లు వచ్చేవి కాదు' అని అన్నారు.

**రోడ్లపై వాళ్లు గోతులు పెట్టెళ్లారు... మనం పూడ్చుతున్నాం**

'విజయవాడద వరద సమయంలో రాత్రింబవళ్లు పని చేశాం. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో వరదలు వచ్చాయి. నీళ్లలోనే నడిచాం... అధికారులను నడిపించాం. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో స్వచ్ఛందంగా రూ.450 కోట్లపైన విరాళాలను ప్రజలు అందించారు. ఎప్పుడు వరదలు వచ్చినా క్యాంప్ లు పెట్టి వెయ్యి, లేదా రెండు వేలు ఇచ్చేవారు. కానీ మొదటి సారి దేశ చరిత్రలో ఒక్కో ఇంటికి రూ.25 వేలు ఇచ్చాం. వరద సమయంలో నీళ్లు, బిస్కెట్లు, పాలు అందించాం. ఆటోకు రూ.10 వేలు, రూ.3 వేలు బైక్ లకు ఇచ్చాం. డ్రోన్స్ ద్వారా ఆహారం అందించాం. దాదాపు 10 రోజులు ఉండి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చాం. 4.15 లక్షల మందికి రూ.618 కోట్లు పరిహారం కింద అందించాం. రైతులకు గత పాలకులు రూ.1674 కోట్లు బకాయిలు పెట్టారు...రాగానే అవి విడుదల చేశాం. రైతుల నుండి ధాన్యం కొంటే 48 గంటల్లోనే డబ్బులు అందించే విధానం మళ్లీ తీసుకొచ్చాం. రూ.4,500 కోట్ల నిధులతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పనులు ప్రారంభించాం...డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. చేపట్టిన పనులు జనవరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలోని రోడ్లన్నీ గోతులు పడ్డాయి. వాటి మరమ్మతులకు రూ.290 కోట్లు విడుదల చేశాం... మరో రూ.446 కోట్లు మళ్లీ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రూ.700 కోట్లు దాదాపు రోడ్లపై గుంతలు పూడ్చడానికి ఖర్చు అవుతుంది. సంక్రాంతికి ముందే రోడ్ల మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించాం. వాళ్లు గోతులు పెట్టారు...వాటిని మనం పూడ్చే కార్యక్రమం చేపట్టాం.' అని అన్నారు.

**చరిత్రలో లేని విధంగా గత పాలకుల కక్ష సాధింపులు**

'రాజకీయాల్లో ఎప్పుడూ చూడని విధంగా గత పాలకులు కక్ష సాధింపులకు పాల్పడ్డారు. పార్టీ కార్యకర్తల ఆస్తులు, ఆధాయవనరులు నాశనం చేశారు. మన ప్రభుత్వంలో పనులు చేసిన వారికి బిల్లులు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణ పేరిట నిలిపేశారు. మనం అధికారంలోకి వచ్చాక రూ.259 కోట్లు నీరుచెట్టు, రూ.50 కోట్లు నరేగాలో పెండింగ్ బిల్లులు ఇచ్చాం. కార్యకర్తలకు న్యాయం చేస్తేనే వారు మనకు అండగా ఉంటారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా దానికి పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత మనపై ఉంది. 10 శాతం అదనంగా ఉద్యోగాలు కల్పించే వారికి ప్రోత్సాహకాలు మరింత ఇస్తామని ప్రకటించాం. ఇండస్ట్రియల్ పాలసీ, ఎంఎస్ఎంఈ ఎంటర్ ప్రెన్యూర్ డెవలెప్మెంట్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ పార్క్, గ్రీన్ ఎనర్జీ.... ఇలా 6 పాలసీలు తసుకొచ్చాం. సూపర్ 6 హామీలులాగే సూపర్ 6 పాలసీలు తీసుకొచ్చాం. ఇవి అమలైతే ఏపీ నెంబర్ వన్ గా అవుతుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కింద అమరావతిలో హెడ్ క్వార్టర్, 5 జోన్లలో 5 ఇన్నోవేషన్ హబ్ లు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంట్లో ఒక వ్యవస్థాపకులు ఉండాలి. రతన్ టాటా స్ఫూర్తితోనే ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ లు ఏర్పాటు చేస్తాం. ఇందులో రైతులను కూడా భాగస్వాములను చేస్తాం.' అని అన్నారు.

## చంద్రబాబును కలిసిన ఐఏఎస్

తెలంగాణలో పనిచేస్తున్న నలుగురు ఐఏఎస్ అధికారులు ఏపీకి వెళ్లారు. గురువారం ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ను కలిసి రిపోర్ట్ చేశారు. దీంతో ఐఏఎస్ ఆఫీసర్ల అంతర్రాష్ట్ర బదిలీల కథ తాత్కాలికంగా సుఖాంతమైంది. వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్ సీఎస్ ను కలిసి తమ జాయినింగ్ రిపోర్ట్ సమర్పించారు.ఇక ఈ నలుగురు ఐఏఎస్ ఆఫీసర్లకు ఎలాంటి శాఖలు కేటాయించనున్నరోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదే సమయంలో ఆమ్రపాలీకి ఏ శాఖ ఇవ్వనున్నారోనన్న చర్చ అధికార వర్గాల్లో మొదలైంది. దీంతో ఆమెను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన టీంలోకి తీసుకోనున్నారని సమాచారం. అక్కడ దక్షిణాది రాష్ట్రాల వ్యవహారాలను పర్యవేక్షించారు. సుదీర్ఘకాలం కేంద్రం, తెలంగాణలో పనిచేసిన ఆమ్రపాలి ఇప్పుడు ఏపీలో పనిచేయనున్నారు. దీంతో పవన్ కల్యాణ్ ఆమె సేవలను తన శాఖలోనే వినియోగించుకోనున్నారని ప్రభుత్వ వర్గాల్లో ఓ చర్చ మొదలైంది. ఇప్పటికే కేరళ కేడర్ కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారి మైలవరపు కృష్ణతేజను పవన్ తన ఓఎస్డీగా నియమించుకున్నారు. పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, అడవులు, పర్యావరణం లాంటి శాఖలను నిర్వర్తిస్తున్న డిప్యూటీ సీఎం, ఈ నలుగురు ఐఏఎస్ అధికారుల్లో మెజారిటీ వాళ్లకు బాధ్యతలు అప్పగించనున్నారట.సొంతూరు ప్రకాశం జిల్లా అయినప్పటికీ ఆమ్రపాలికి వైజాగ్ అంటే కొట్టినపిండే. అక్కడే చదవుకున్నారు కూడానూ. ఆమె తండ్రి వెంకట్ రెడ్డి ఏయూలో ఎకనామిక్స్ ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తించారట. దీంతో వైజాగ్ మున్సిపాలిటీ కమిషనర్ గానూ ఈమెను నియమించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ గా ఆమ్రపాలి, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా వాకాటి కరుణ స్త్రీ, యువజన సర్వీసులు, టూరిజం, కల్చరల్ శాఖ ప్రధాన కార్యదర్శిగా వాణీ ప్రసాద్ , విద్యుత్ శాఖ ఎండీగా రొనాల్డ్ రాస్ పనిచేశారు. ఇప్పుడు వీరందరికీ ఎలాంటి బాధ్యతలు అప్పగించనున్నారది తెలుగునాట ఆసక్తికరంగా మారింది.

## కోర్టుకు కేసీఆర్ డుమ్మా

ప్రజాధనం దుర్వినియోగం అయిందని, దీనిపై విచారణ చేయాలని కోరుతూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి జిల్లా కోర్టులో ప్రైవేట్ కేసు వేశారు. దీనిపై గతంలో రెండు సార్లు భూపాలపల్లి జిల్లా కోర్టు కేసీఆర్‌తో సహా పలువురికి సమన్లు జారీ చేసింది. కాగా, కేసీఆర్, స్మితా సభర్వాల్ మినహా సమన్లు అందుకున్న వారందరి తరఫున వారి లాయర్లు గతంలో కోర్టుకు హజరయ్యారు. కానీ, మూడోసారి కూడా కేసీఆర్ ఈ సమన్లకు స్పందించలేదు.ఈ కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు 8 మందికి ఆగస్టు మొదటి వారంలో నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 5న భూపాలపల్లి జిల్లా కోర్టుకు హాజరుకావాలని అందులో ఆదేశించారు. అయితే, సెప్టెంబరు 5న మాజీ మంత్రి హరీశ్రావు తరఫున న్యాయవాదులు లలితా రెడ్డి, సుకన్య.. కాంట్రాక్ట్ సంస్థ మేఘా కృష్ణారెడ్డి, ఇరిగేషన్ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్, ఎల్ అండ్ టీ ఎండీ సురేశ్ కుమార్ తరఫున సుప్రీంకోర్టు అడ్వకేట్లు అవధాని, శ్రావణ్ రావు.. ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్లు హరిరామ్, శ్రీధర్ తరఫున వరంగల్ అడ్వకేట్ నరసింహారెడ్డి హాజరయ్యారు. కానీ, మాజీ సీఎం కేసీఆర్, సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ తరపున న్యాయవాదులెవ్వరూ కోర్టుకు హాజరుకాలేదు. దీంతో అక్టోబరు 17కు కేసును వాయిదా వేస్తూ జిల్లా జడ్జి నారాయణబాబు ఉత్తర్వులిచ్చారు. కానీ, కోర్టుకు మరోసారి కేసీఆర్, స్మితా సబర్వాల్ డుమ్మా కొట్టటం చర్చగా మారింది.

**న్యాయపోరాటం ఆగదు: రాజలింగమూర్తి**

చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని పిటిషినర్ రాజ లింగమూర్తి మీడియాతో అన్నారు. భారీ మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగమైందని చెప్పారు. బాధ్యత గల ప్రజా ప్రతినిధిగా కేసీఆర్ కోర్టుకు వచ్చి, వాస్తవాలు వివరించాలని ఆయన కోరారు.

## సిద్ధప్పకు బిగిస్తున్న ఉచ్చు

ఈడీ అధికారుల వెంట కేంద్ర పారామిలిటరీ బలగాలు కూడా తనిఖీల్లో పాల్గొనడం గమనార్హం. ఈడీ అధికారులు తనిఖీలు చేసిన ఆఫీసులన్నింటికీ ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లేదా ఆయన కుటుంబ సభ్యులతో లింక్ ఉన్నట్లు తెలుస్తోంది.ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరు ముడా అధికారులను ఈడీ అధికారులు.. విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది.ఇక ఈడీ అధికారుల తనిఖీల సందర్భంగా కేంద్ర పారామిలటరీ ఫోర్స్ వారి వెంబడి భద్రత కోసం రావడం గమనార్హం. మైసూరులోని వివిధ ప్రాంతాల్లో ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. అయితే ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గానీ.. ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో గానీ, వారికి సంబంధించిన వారి ఇళ్లల్లో సోదాలు జరగలేదని అధికారులు పేర్కొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకి బాసటగా ఉప్పల్ ఎమ్మెల్యే

- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా చెక్కు అందజేత



**జయభేరి, ఉప్పల్ :**
మల్లాపూర్ డివిజన్ పరిధిలోని SV Nagar కాలనీ కి చెందిన శీతల విజయ్ కుమార్ కుమార్తె అఖిల ప్రతిమ మెడికల్ కాలేజీ వరంగల్ లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అలాగే వస్పతి శ్రీనివాస్ కుమారుడు జీవన్ కుమార్ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో BLR చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 29,000/ (ఒక్కొక్కరికి) రూపాయల చెక్కును మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా చెక్కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, వాసు, దయాకర్ రెడ్డి, నెమలి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ లపై హైడ్రా గురి

గురయ్యాయో గుర్తించి, ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఆ తర్వాత బుల్ డోజర్లతో వెళ్లి కూల్చేయనున్నారు. కేవలం ఫుట్ పాత్ పై ఆక్రమణలే కాదు.. ఆ ప్లేస్‌లో ప్రభుత్వానికి చెందిన ఎలాంటి షాపులున్నా, ఏమాత్రం ఆలోచించకుండా కూల్చేయనున్నారు.ఫుట్ పాత్ ల ఆక్రమణల తొలగింపుతో పాటు డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని హైడ్రా నిర్ణయం తీసుకుంది. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు లేని సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులతో కలసి హైడ్రా డీఆర్ఎఫ్ బృందం కలిసి పని చేసేలా ఏర్పాట్లు చేయాలని వారు సమావేశంలో చర్చించారు.రెండు విభాగాలు కలసి పని చేయాలని, ముఖ్యమైన సమయాల్లో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది కూడా రంగంలోకి దించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్షం పడినప్పుడు వరద నీరు (వాటర్ లాగింగ్) చేరే ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి నీటిని తొలగించేందుకు డీఆర్ఎఫ్ బృందాలతో ట్రాఫిక్ పోలీసులు కలిసి పని చేస్తాయని అధికారులు తెలిపారు. వెంటనే నీరు తొలిగించేలా హార్స్ పవర్ ఎక్కువ ఉన్న మోటర్ల వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఆ నీటిని ఎక్కడకు తోడాలనేదానిపై చర్చ జరిగినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు, వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్వత పరిష్కారం చూపడం వంటివి చేస్తామని వారు తెలిపారు.వర్షం పడినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని డిసైడ్ ~~అయ్యారు. తక్షణమే నీరు తొలిగించేలా హైపవర్ మోటర్లను వి~~ నియోగించాలని నిర్ణయించారు. హైడ్రా, ట్రాఫిక్ విభాగం కలిసి వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు.అలాగే జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగాలతో కలిసి నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటమే కాదు.. నగర ప్రజలు సాఫీగా నడచుకుని వెళ్లే విధంగా ఫుట్ పాత్‌లను రూపొందించాలని నిర్ణయించింది హైడ్రా. అలాగే కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించాలని డిసైడైంది. మొత్తంగా.. పలు విభాగాలు, ప్రజల భాగస్వామ్యంతో భాగ్యనగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది హైడ్రా.

## యాసిడ్ తో పాల తయారీ...



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:**
హైదరాబాద్ లో కల్తీ మాఫియా రెచ్చిపోతుంది. అక్రమ సంపాదనే ధ్యేయంగా వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో కల్తీపాలను తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు అయ్యింది. మేడిపల్లిలో నకిలీ పాలు తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో.. పాల తయారీ కేంద్రంపై మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ పోలీసులు దాడులు జరిపారు. పౌడర్‌తో నకిలీ పాలు తయారు చేస్తున్న గజేందర్ సింగ్ రాజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల చేసిన తనిఖీల్లో..300 కేజీల పన్నీరు, 4 వేల 500 లీటర్ల రిఫైండ్ ఆయిల్, 750 లీటర్ల అసిటిక్ యాసిడ్, 15 లీటర్ల గ్లూకోజ్ లిక్విడ్‌ను సీజ్ చేసారు. దాంతో పాటు 16 వేల 250 కేజీల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గజేందర్ పై కేసు నమోదు చేసి పీఎస్‌కు తరలించారు. పీర్జాదిగూడా ప్రాంతంలోనే కాకుండా బోడుప్పల్, ఉప్పల్ ప్రాంతాల్లోనూ పాలు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు.ఇదిలా ఉంటే మరోవైపు.. జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి చికెన్ సెంటర్లు. కుళ్లి పోయిన చికెన్ యధేచ్ఛగా అమ్మేస్తున్నాయి. సికింద్రాబాద్ బేగంపేట్ ప్రకాష్ నగర్‌లో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసుల సోదాల్లో భయంకరమైన విషయాలు బయటకొచ్చాయి. బాలయ్య చికెన్ సెంటర్‌లో కుళ్లిన కోడి మాంసం బయటపడింది. కోడి ఎముకలకు కెమికల్స్ కలిపి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు.. జనతా బార్లకు అమ్మేస్తున్నారు .టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల కలిసి ఆకస్మిక తనిఖీలు చేశాయి. బాలయ్య చికెన్ సెంటర్ లో తనిఖీలు నిర్వహించగా కుళ్ళిన కోడి మాంసంంతోపాటు కొవ్వు పదార్థాలు దొరికాయి. ఏడు క్వింటాళ్ల కుళ్ళిన చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాలయ్య చికెన్ సెంటర్‌కు తాళాలు వేశారు.

## తాగి డ్రైవ్ చేశావా దొరికిపోతావ్...

- మద్యం సేవించిన 31 మందికి రు 24500 జరిమానా...!
- డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి పెట్టిన గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి




**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 18 :**
గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 31 మందికి రూ 24,500/ వేల రూపాయల జరిమానా విధించారు.గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, మరియు ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 31 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి ప్రియాంక ముందు హాజరుపరచగా విచారణ చేసి 31 మందికి రూ 24,500/వేల రూపాయల జరిమాన విధించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలి

- ఏకపక్షంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలని నల్గొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసిన Ex.రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు జర్పుల లోక్య నాయక్





**జయభేరి, చందంపేట :**
చందంపేట మండలంలోని 28 గ్రామపంచాయతీలు ఏ ఒక్క గ్రామ పంచాయతీలో కూడా గ్రామసభలు పెట్టలేదు స్పెషల్ ఆఫీసర్ సెక్రెటరీ కి ఎలాంటి సమాచారం లేదు గవర్నమెంట్ జీవో ప్రకారం కమిటీలోని సభ్యులను ఎంపీడీవో నామినేట్ చేయాల్సి ఉంది. ఈ కమిటీలో జీవో ప్రకారం గ్రామ అభివృద్ధి కోరే వ్యక్తులను నియమించాల్సి ఉన్న కూడా నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కూర్చొని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇట్టి విషయం చట్ట విరుద్ధం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నాయకులను మాత్రమే కమిటీలో సభ్యులుగా నియమించినారు. ఇట్టి విషయంలో స్థానిక ఎంపీడీవోకి ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఎమ్మెల్యే ఎలా చెబితే అలా చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కావున ఏకపక్షంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దుపరిచి మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోగలరని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో Ex.రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షులు జర్పుల లోక్య నాయక్, Ex. MPTC బాలవర్ధిరాజ్, BRS మండల నాయకులు అందుగుల సైదులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తరి గోవర్ధన్, మండల నాయకులు కాట్రావత్ హరిలాల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూమా.. ఏవీల ఆధిపత్య పోరు ఆళ్లగడ్డలో నెలకొన్న హై టెన్షన్...

- ఆళ్లగడ్డ లో ఉండడానికి వీలులేదు.. ఎమ్మెల్యే
- ఏ జరిగినా ఇక్కడే ఉంటా... ఏవీ సుబ్బారెడ్డి




**జయభేరి, కర్నూల్ :**
రాష్ట్ర రాజకీయాలలో ఆళ్లగడ్డ ఫ్యాక్షన్ కు అడ్డా బాంబుల గడ్డగా పేరుంది. అలాంటి ఆళ్లగడ్డలో రెండు రోజులుగా హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఏవి ,భూమా వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది .ఎన్నికల సమయంలో ఇరువురు నేతల అనుచరుల మధ్య భారీగా గొడవలు జరిగాయి. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మరియు ఏవి సుబ్బారెడ్డి ల మధ్య రాజకీయ వివాదం మళ్లీ మొదలైంది. గురువారం ఏవి ఆళ్లగడ్డకు చేరుకోవడంతో రాజకీయ వేడి మొదలైంది .ఆళ్లగడ్డలో ఉండడానికి వీలు లేదని, నియోజకవర్గం వదలి వెళ్లిపోవాలని ఏవి సుబ్బారెడ్డికి ..మాజీ మంత్రి ,ప్రస్తుత ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. నా స్వగృహం లో ఉంటానని, ఏం జరిగిన నేను ఇక్కడనే ఉంటానని ఏవి సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతకు దారులు తీస్తాయనే నేపథ్యం లో పోలీసులు భారీగా మోహరించి వారి కుటుంబాల ఇంటిదగ్గర భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు . దీంతో పట్టణంలోని వ్యాపార , వస్త్రాలు మరియు దుకాణం యజమానులు ఇరువర్గాల మధ్య ఎలాంటి పరిస్థితులు దారితీస్తాయోనని దుకాణాలు స్వచ్ఛందంగా మూసి వేశారు. ఈ ఇద్దరి నేతల మధ్య గతంలో మాటల దాడులు జరిగాయి . ఎన్నికల అనంతరం మాజీ మంత్రి భూమా అఖిలప్రియ బాడీగార్డ్ పై కొందరు దుండగులు హత్య ప్రయత్నం చేశారు . అప్పట్లో ఆమె ఈ దాడి పై స్పందిస్తూ ఏవి సుబ్బారెడ్డి పనేనని బహిరంగంగా ఆరోపించింది .ఎన్నికల శంఖారావం లో ఏవిని వేదిక ఎక్కనివ్వనని ఏవి సుబ్బారెడ్డి పై భూమా అఖిలప్రియ చేసిన ఘాటైన వ్యాఖ్యలు అందరికీ తెలిసిందే.! ఆళ్లగడ్డలో టిడిపి అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు సైకిల్ యాత్ర చేపట్టిన ఏ వి సుబ్బారెడ్డి పై రాళ్ల వర్షం కురిపించిన సంఘటనలు నియోజకవర్గ ప్రజలు మర్చిపోలేదు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా నంద్యాల నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఆయన సమక్షంలోనే ఏవి ,భూమ వర్గాల మధ్య గొడవలు జరగడంతో పార్టీ అధిష్టానం సీరియస్ తీసుకుని ఇరువర్గాల పై అసహనం వ్యక్తం చేస్తూ పార్టీ మందలించింది. ఆళ్లగడ్డ పరిణామాల పై పార్టీ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.



## ఏ ఆపద వచ్చిన పార్టీ అండగా ఉంటుంది

**జయభేరి, ఘట్కేసర్ :**
ప్రమాదవశత్తు రోడ్డు ప్రమాదంలో ఘట్కేసర్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కీర్తి శేషులు డ్యాగాల రమేష్ మరణించడం జరిగింది. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త సభ్యత్వం నమోదు ఇన్సూరెన్స్ పాలసీ కింద అతని భార్య దేగల రజితకు ఘట్కేసర్ క్యాంప్ కార్యాలయంలో రూపాయలు 200000/ రెండు లక్షల రూపాయల చెక్కును మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కార్యకర్తలను గుర్తించిన పార్టీ ఒక బిఆర్ఎస్ పార్టీనని సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాదవశత్తు విధాన ప్రమాదం సంభవించినప్పుడు బీమా సౌకర్యం కల్పించిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అందుకే దేశంలో ఏ పార్టీకి లేని సభ్యత్వం బిఆర్ఎస్ పార్టీకి మాత్రమే సభ్యత్వంలో ముందుందని కార్యకర్తల బలం చాలా ఉందని పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడెక్కిన వేలాదిమంది విద్యార్థులు

- "స్కాలర్ షిప్ లు ప్రభుత్వం బిక్ష కాదు - విద్యార్థుల హక్కు"
- పెండింగ్ లో ఉన్న ₹ 7500 కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- అంకం శ్యామ్ కిరణ్, ABVP రాష్ట్ర కార్య సమితి సభ్యులు




**జయభేరి, ఘట్కేసర్ :**
తెలంగాణ రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బ్రతుకులు మారడం లేదని గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసం చేస్తుందని.. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న విద్యారంగానికి బడ్జెట్ కనీస నిధులు కేటాహించకుండా గతం కంటే తక్కువ (6.5%) కేటాయించడం అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతం అవుతుంది. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం తూట్లుపొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు. గత మూడు సంవత్సరాలుగా దాదాపు రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నా ఈ ప్రభుత్వం ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరును ఏబీవీపీ తీవ్రంగా పరిగణిస్తున్నాయి.



విసిబ్లె పోలీసింగ్ లో భాగంగా మేడిపల్లి ఇన్స్పెక్టర్ R. గోవిందా రెడ్డి, M. బాలస్వామి, DI , SI ఉదయ్ భాస్కర్, వీర బాబు, స్టేషన్ సిబ్బంది తో వరంగల్ హైవే పై ఉనా వ్యాపార యజమానులకు సీసీటీవీ కెమెరాస్, డయల్ 100 ల యొక్క ప్రాముక్యతను.. సైబర్ క్రైమ్ మోసాలు పట్ల అవగాహన తెలపటం జరిగింది.

## చైర్మన్ కు జన్మదిన శుభాకాంక్షలు



**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 18 :**
శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ కు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు..

## యూనివర్శిటీలకు కొత్త వీసీలు

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:**
రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వీసీల పేర్లతో కూడిన నియామక దస్త్రాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించగా.. ఆయన సంతకం చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారికంగా కొత్త వీసీల నియమాకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ 9 యూనివర్సిటీల్లో ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వ విద్యాలయం ఉన్నాయి. యూనివర్సిటీ పేరు కొత్త వీసీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కుమార్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ యాదగిరి రావు, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ నిత్యానందరావు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజిరెడ్డి.

# జర్నలిస్టులపై దాడులు అరికట్టి రక్షణ కల్పించాలి..

■ పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ కి వినతి పత్రం అందజేసిన నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (ఎన్.ఏ.ఆర్.ఏ) నాయకులు

**జయభేరి, నరసరావుపేట :**

జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూ జర్నలిస్టుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక జర్నలిస్టు అసోసియేషన్.. అతి తక్కువ కాలంలో భారత దేశంలోనే ఎక్కువ సభ్యులను కలిగిన అసోసియేషన్ గా నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ గుర్తింపు పొందింది. జర్నలిస్టుల సంక్షేమానికి ఎన్నో రకాల పోరాటాలు చేసినా కూడా జర్నలిస్టుల బ్రతుకుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం తో జర్నలిస్టుల మనుగడ ప్రశ్నార్ధకంగా మారిపోయింది.. జర్నలిస్టుల సంక్షేమానికి "జర్నలిస్టుల కార్పొరేషన్" ను ఏర్పాటు చేస్తేనే ఫలితం ఉంటుందన్న ఉద్దేశంతో నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్ష పార్టీల నాయకులను కలిసి జర్నలిస్ట్ కార్పొరేషన్ ఏర్పాటు, జర్నలిస్టుల రక్షణ కొరకు కఠిన చట్టాలు చేసే వరకు నిరంతరం పోరాటానికి సిద్ధమయింది. ఈ నేపథ్యంలోనే జర్నలిస్ట్ సోదరులకు జరుగుతున్న అన్యాయాన్ని వారి కష్టాలను దృష్టిలో పెట్టుకొని 28 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేంద్ర బాబు ఆధ్వర్యంలో నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (ఎన్.ఏ.ఆర్.ఏ) పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ ని కలిసి జర్నలిస్టులపై దాడులు అరికట్టి రక్షణ కల్పించాలని, జర్నలిస్టుపై దాడులకు నివారణకు కఠిన చట్టాలు అమలు చేయాలని వినతి పత్రాన్ని నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై మీరు చేసే అవిశ్రాంత పోరాటానికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఎన్.ఏ.ఆర్.ఏ నాయకులకు తెలియచేసారు. పత్రికా స్వేచ్ఛ ప్రజా సమాజానికి, వ్యక్తి జీవనానికి అత్యంత కీలకమైనది. ఆ దేశంలోకానీ, సమాజంలో కానీ పత్రికా స్వేచ్ఛను నియంత్రించడమంటే ఆ సమాజాన్ని అంధకారంలోకి నెట్టివేయడమన్నారు.. జర్నలిస్టులపై దాడులు నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలియజేశారు. అనంతరం నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బండి సురేంద్రబాబు పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ కు శాలువా తో సన్మానించారు. పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ కలిసిన వారిలో నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బండి సురేంద్రబాబు, ఉమెన్స్ వింగ్ నేషనల్ ప్రెసిడెంట్ మద్దినేని మానస, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు మక్కెన సురేంద్రబాబు, ఖాదర్ వలీ, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, సురేష్, ముక్తార్, నల్లూరి ప్రదీప్ కుమార్, జయరాజు, పి వెంకటేశ్వర్లు, కోటయ్య, జయప్రకాష్, ఉన్నారు.





## ఎఫ్.సిఆర్ఐ లో పాములపై అవగాహన సదస్సు

**జయభేరి, గజ్వేల్ ములుగు, అక్టోబర్ 18 :**

సిద్దిపేట జిల్లా ములుగు మండలం కేంద్రంలోని అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థ (ఎఫ్.సి.ఆర్.ఐ)లో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు గంటల పాటు జరిగిన అవగాహన ఈ కార్యక్రమంలో భాగంగా విష సర్పాలను, విషం లేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ఎస్ శ్రీనిధి మాట్లాడుతూ "సమాజంలో సర్పాలంటే అందరికీ ప్రతికూల భావన ఉంది. పాములన్నీ ప్రమాదకరమైనవి కాదు. కేవలం కొన్ని రకాల పాములు మాత్రమే విషపూరితమైనవి మిగిలిన అనేక రకాల పాములు పంటలను నాశనం చేసే ఎలుకలను, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయి. పాము కరిచినపుడు ప్రథమ చికిత్స చాలా ముఖ్యమైనది. మనం బ్రతుకుతూ ఇతర జీవరాశులను బ్రతకనివ్వాలి అనే స్పృహ కలిగి ఉండి పాములను రక్షించుకుందాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో 120 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఏకైక సంఘం పిఆర్టియు



**జయభేరి, గజ్వేల్ జగదేవపూర్, అక్టోబర్ 18 :**

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, పిఆర్టియు టిఎస్ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి మద్దతుగా జగదేవపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఫామ్ 19 ఓటు హక్కు ఉన్న ప్రతి ఉపాధ్యాయునికి అందజేసారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో నిరంతరము పోరాడుతూ ఎన్నో జీవోలను తీసుకొచ్చి ఉపాధ్యాయుల సంక్షేమం గురించి పాటుపడే అతిపెద్ద ఏకైక సంఘం పీఆర్టీయు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొద్దు నాయక్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, నరసింహారెడ్డి, రఘురాములు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులు అనురాధ, ఉపాధ్యాయ సోదరి, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు

## ఇంటి పక్కోడే దొంగ..!

■ మునిగడప గ్రామంలో దొంగతనంకు పాల్పడిన నేరస్తుడి అరెస్ట్.



**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 18 :**

గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి కథనం ప్రకారం, గత 2 వారాల క్రితం మునిగడప గ్రామంలో తలారి సురేష్, తన కుటుంబ సభ్యులతో కలసి వారి బంధువు అంత్యక్రియలకు వెళ్లగా అదే అదునుగా భావించిన తుమ్మ నవీన్ రాత్రి సమయంలో సురేష్ ఇంటిలోకి ప్రవేశించి నగదు రు 25,000 మరియు అరతులం బంగారు ఉంగరంను దొంగిలించాడు, ఇట్టి నేరానికి పాల్పడిన వ్యక్తి తుమ్మ నవీన్ ను శుక్రవారం జగదేవ్పూర్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ను సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## పి బోనంగిలో కన్నయ్య చెరువుకు గండి



**జయభేరి, పరవాడ :**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పి బోనంగి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి పోర్టికో కాలనీలో ఉన్న కన్నయ్య చెరువు గత వారం రోజుల నుండి పడుతున్నటువంటి భారీ వర్షాలకు గండి కొట్టడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించి వెంటనే స్థానిక రెవిన్యూ సిబ్బందికి పరిస్థితిని వివరించారు. పోర్టికో కాలనీలో ఫేస్ వన్ నుండి ఫేస్ టు కి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా జలమయిపోవడంతో కోలనివాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పరిస్థితిని గమనించిన గ్రామ సర్పంచ్ వీలైనంత తొందరలోనే ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం చూపుతానని ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ కమిటీల సమావేశం

■ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరేలా చేయడమే ఇందిరమ్మ కమిటీల లక్ష్యం.. మందుముల పరమేశ్వర్ రెడ్డి



రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా ప్రజా పాలన సాగుతుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులకు అందుతున్నాయి అన్నారు. ఇవి రెండూ కూడా మరింత పారదర్శకంగా ప్రజలకు చేరవేసేందుకే రాష్ట్రంలో సరికొత్తగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టుగా చెప్పారు.
ఉప్పల్ నియోజకవర్గంలోని ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కోసం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలు కీలక పాత్రను పోషించాలని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి సోషించారు.
ప్రభుత్వ ఆలోచనలకు, లక్ష్యాలకు అనుగుణంగా ఈ కమిటీలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాఘవ రెడ్డి, పాకాల రాజు, పెద్ది నాగరాజ్, పెద్ది శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, అజ్జిజ్, భూపాల్ రెడ్డి, లింగస్వామి, నర్సింహా, అనిల్, భవాని, ఉష, రవితేజ, ప్రవీణ్, హరినాథ్, సింగం కిరణ్, సందీప్, మామిడి శ్రీనివాస్, విజయేందర్, స్వామి, ఉమా, నాగేశ్వర్ రెడ్డి, బాలనర్సింహా, రాజేష్, శివ, సాయి, విష్ణు, మీనా, రాణి, దాన, మాదవి, కే సలీం సాహెబ్, మహబూబ్ పశ, అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం..

■ సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మ్యకల కనకయ్య..

**జయభేరి, గజ్వేల్ మార్కుక్, అక్టోబర్ 18:**

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బిఆర్ఎస్ నాయకుడు,సిద్ధిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మ్యకల కనకయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో గజ్వేల్ కి 170 కోట్ల నిధులను మంజూరు చేసిందని ఆ నిధులను మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ అందించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని,గజ్వేల్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఓటు హక్కు వినియోగం పై అవగాహన సదస్సు


**జయభేరి, పరవాడ:**






స్థానిక గొన్న కళాశాలలో ఓటు హక్కు వినియోగ అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిపించడం కోసం పరవాద మండల తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్ మరియు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అర్జున రావు సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్ విద్యార్థులకు ఓటు హక్కుని ఏ విధంగా ఉపయోగించుకోవాలి,ఓటు హక్కు గల ప్రాముఖ్యత కోసం మరియు ఓటు హక్కు వినియోగం వల్ల వచ్చే పరిణామాల కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో గొన్న ప్రిన్సిపల్ పి ఎస్ ఎస్ మూర్తి విభాగ అధిపతులు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు పరవాడ మండలంలో ఎమ్మెల్యే పర్యటన



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో వాడ చీపురుపల్లి పంచాయతీ పరిధిలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు శంకుస్థాపన చెయ్యడానికి శనివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు విచేస్తున్నట్టు మాజీ ఎంపీపీ మసవరపు అప్పలనాయుడు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.వాడ చీపురుపల్లి పంచాయతీ పరిధిలో పోలిరెడ్డిపాలెం ,తారకరామ కాలనీ,నరసాపురం లింక్ రోడ్,దళైపాలెం, చీపురుపల్లి వారి వీదిలో కోటి ఒక లక్షతో సీసీ రోడ్ లు పనులు స్టార్ట్ చేస్తారు అని ఈ కార్యక్రమంకు మండలంలో ఉన్న ఉమ్మడిపార్టీల నాయుకులు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, యువకులు,మహిళాలలు,కార్యకర్తలు అందరూ హాజరుకావలిని అన్నారు.

## ఘనంగా ముత్యాల రవి జన్మదిన వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**

పుట్టిన రోజు సందర్భంగా నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ఆశీర్వాదం తీసుకున్న ముత్యాల రవి. బిఆర్ఎస్ దేవరకొండ పట్టణంలోని 9వ వార్డు అద్యక్షులు ముత్యాల రవి పుట్టిన రోజు సందర్భంగా మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ఆశీర్వాదము తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ రవిని శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# స్పెషలిస్ట్ కంపెనీ సెక్రటరీలకు శిక్షణ

- అభివృద్ధి చెందుతున్న రంగాలలో కంపెనీ సెక్రటరీలది ముఖ్య పాత్ర
- తెలివితేటలు పురోగతికి కీలకమైన డ్రైవర్: జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ గవర్నర్
- ఇండల్జెన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ అనే థీమ్‌తో ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల 16వ SIRCని గవర్నర్ ప్రారంభించారు.
- ICSI, మారిటైమ్ లా, క్యాపిటల్ మార్కెట్స్ వంటి స్పెషలైజేషన్‌లలో స్పెషలిస్ట్ కంపెనీ సెక్రటరీలకు శిక్షణ ఇస్తోంది: నరసింహన్, ICSI జాతీయ అధ్యక్షుడు



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 19:**

నగరంలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో (సెస్) "ఇండెల్జెన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ అనే థీమ్‌తో రెండు రోజుల ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల 16వ దక్షిణ భారత ప్రాంతీయ సదస్సును శుక్రవారం పంజాగుట్టలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోని 200 మందికి పైగా కంపెనీ కార్యదర్శులు, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం ముగిసిన వెంటనే సభను ఉద్దేశించి ప్రసంగించిన తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రగతికి ఇంటెలిజెన్స్ కీలక చోదకమని అన్నారు. ఇతివృత్తం చాలా సముచితంగానూ, సందర్భోచితంగానూ ఉందన్నారు. సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కంపెనీల సెక్రటరీలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. నేడు కంపెనీ సెక్రటరీలు దివాలా, మధ్యవర్తిత్వం, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్, అనేక ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. వృత్తిలోకి ప్రవేశించే యువ నిపుణులు తప్పనిసరిగా అప్‌డేట్‌గా ఉంటూ, సమ్మతిని నిర్ధారించుకోవాలని ఆయన అన్నారు. మారిటైమ్ లా, క్యాపిటల్ మార్కెట్స్ వంటి కొన్ని రంగాలలో ICSI అనేక మంది నిపుణులైన కంపెనీ సెక్రటరీలను అభివృద్ధి చేస్తోందని గమనించడం నాకు సంతోషంగా ఉందని గవర్నర్ చెప్పారు. ఈ స్పెషలైజేషన్లు ఇప్పుడు అవసరం. మారిటైమ్ లా, క్యాపిటల్ మార్కెట్స్ వంటి ఈ స్పెషలైజేషన్‌లలో స్పెషలిస్ట్ కంపెనీ సెక్రటరీలు వృత్తిని చాలా దూరం తీసుకువెళతారు. ఎందుకంటే ప్రపంచం మరింత సూపర్ స్పెషల్‌గా మారుతోంది. మీరు మీ వాటాదారులతో దృఢమైన సంబంధాలను ఏర్పరచుకోవాలి అని ఆయన అన్నారు. ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఫీజు మినహాయింపులు అందించినందుకు నేను మిమ్మల్ని అభినందిస్తున్నాను అన్నారు. మార్కుల శాతంతో సంబంధం లేకుండా 10+2 లేదా తత్సమానం లేదా తత్సమానం బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమానం ఉత్తీర్ణులైన ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన విద్యార్థులందరికీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ లేదా ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ స్టేజ్‌లో నమోదు చేసుకునేటప్పుడు ఫీజు మినహాయింపు ఇవ్వబడుతుంది అని ఆయన తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐసిఎస్ఐ జాతీయ అధ్యక్షుడు బి నరసింహన్ మాట్లాడారు. 2047 నాటికి జిడిపి 30 ట్రిలియన్‌గా మారినప్పుడు భారతదేశానికి దాదాపు 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీలు అవసరమని ఆయన అన్నారు. మారిటైమ్ లాలో MBA కలిగిన కంపెనీ సెక్రటరీలను తయారు చేయడానికి ICSI గుజరాత్ న్యాయ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని ఆయన తెలియజేశారు. కంపెనీ సెక్రటరీ వృత్తి దివాలా నిపుణులుగా భారీ గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు. మీరు క్యాపిటల్ మార్కెట్ల గురించి ఆలోచించినప్పుడల్లా మీకు గుర్తుకు వచ్చే ఏకైక వృత్తి కంపెనీ సెక్రటరీల వృత్తి అని ఆయన అన్నారు. వచ్చే నెలలో హైదరాబాద్ చాప్టర్ బిల్డింగ్ ఆఫ్ కంపెనీ సెక్రటరీల భూమి పూజను ప్రారంభించనున్నట్లు ఐసీఎస్ఐ సభ్యుడు సీఎస్ ఆర్ వెంకట రమణ తెలిపారు. రూ.10 కోట్ల పెట్టుబడితో 10వేల చదరపు అడుగుల భవనాన్ని నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కంపెనీ సెక్రటరీల ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఎగ్జామినేషన్‌లో మొదటి ప్రయత్నంలోనే అన్ని పేపర్లలో ఉత్తీర్ణత సాధించిన కృష్ణ అగర్వాల్‌కు దివంగత మదినీడి రామకృష్ణ సుభద్ర స్మారక అవార్డును గవర్నర్ అందజేశారు. కృష్ణ అగర్వాల్‌కు దివంగత అహల్య పుట్టీ స్మారక అవార్డు కూడా లభించింది. కార్యక్రమంలో ఐసిఎస్ఐ వీపీ ధనంజయ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.



# 8 దేవస్థానాలలో ఆన్లైన్ సేవలు



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:**

తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన దేవాలయాల్లో సేవలను బుక్ చేయడం ఇప్పుడు మరింత సులభతరంగా మారింది. ఈ సేవలు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉండనున్నాయి. దీని ద్వారా భక్తులు ఇంటి వద్ద నుంచే తమ పూజలు, హాల్ బుకింగ్స్ వంటి అవసరాలను పూర్తి చేసుకోవచ్చు. రాష్ట్రంలోని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, వరంగల్‌లోని రుద్రేశ్వర ఆలయం (రామప్ప దేవాలయం), వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కాళేశ్వరం శివ ఆలయం వంటి ప్రసిద్ధ దేవాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. అనేక ప్రసిద్ధ దేవాలయాలు ఇప్పుడు తమ సేవలను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందిస్తున్నాయి. భక్తులు తమకు కావాల్సిన పూజలను లేదా వివాహాల కోసం హాల్‌లను ముందుగానే బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం భక్తులకు చాలా సౌలభ్యంగా ఉంటుంది, ముఖ్యంగా శుభ ముహూర్తాల సమయంలో వివాహాల సంఖ్య ఎక్కువగా ఉండే కారణంగా, ఫంక్షన్ హాల్స్ కోసం పోటీ పెరుగుతుంది.ఈ సేవల కోసం ప్రత్యేక వెబ్‌సైట్లు ఏర్పాటు చేయబడ్డాయి, అక్కడ భక్తులు ఆలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో సేవలను బుక్ చేసుకోవచ్చు. పూజల రుసుములు, వివాహాల కోసం హాల్స్ ఖాళీగా ఉన్న తేదీలు వంటి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.సుందరాచలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వంటి దేవాలయాలు కూడా ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించాయని కథనం తెలియజేస్తుంది.ఆన్లైన్ బుకింగ్ అన్ని T App folio ద్వారా చేసుకోవచ్చు ప్రసాదాలను సైతం ఇంటి వద్ద నుండే బుక్ చేసుకునే వెసలు బాటను కల్పించారు. దీంతోపాటు దేవస్థానం యొక్క చరిత్రను సైతం ఆన్లైన్లో తెలుసుకునే విధంగా యాప్ను తీర్చిదిద్దారు. మరోవైపు స్వామివారి సేవలకు సంబంధించిన వాటిని సైతం ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు. సుప్రభాతం అభిషేకం సహస్రనామ అర్చన నిత్య కళ్యాణం తోపాటు 11 రకాల పూజలను ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు.ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 8 దేవస్థానాలలో ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు. ఈ సదుపాయం మరో 39 ప్రధాన ఆలయాలకు సైతం విస్తరించనున్నారు. ఆన్లైన్లోనే టికెట్ కొనుక్కోవడం దానికి సంబంధించిన సాఫ్ట్వేర్ను దేవస్థానంలో అమర్చడం ద్వారా ఇంటి వద్ద నుండే దైవదర్శనం చేసుకోవడంతో పాటు స్వామివారి సేవలను పాల్గొనే సదుపాయాన్ని తీసుకొచ్చారు. మీసేవ కేంద్రాల వద్ద కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

# అన్వితం.. మోసాల పంట...



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 18:**

తెలంగాణలో రియల్ భూం కొన్ని కంపెనీలకు కాసుల పంట కురిపిస్తోంది. వివాదాస్పద భూముల్లో పాగా వేయడం, కస్టమర్లకు అంటగట్టి తప్పించుకోవడం షరా మామూలే. కొన్ని కంపెనీలు అయితే ప్రీలాంచ్ పేరుతో డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పే స్తాయి. దీనికి చక్కటి ఉదాహరణ సాహితీ ఇన్‌ఫ్రా. సామాన్యుల సొంతింటి కలను ఆసరాగా చేసుకుని ప్రీలాంచ్ పేరుతో డబ్బులు వసూలు చేసే కంపెనీలు చాలానే ఉన్నాయి. వాటిలో అన్విత బిల్డర్స్ ఒకటి. తాజాగా ఈ కంపెనీకి సంబంధించిన ఆఫీసులు, ఓనర్ల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలకు దిగడంతో ఈ కంపెనీ వ్యవహారాలపై చర్చ జరుగుతోంది.అన్విత బిల్డర్స్ కార్యాలయాల్లో ఐటీ అధికారులు సుదీర్ఘ సోదాలు నిర్వహించారు ఐటీ అధికారులు. వచ్చిన ఆదాయానికి చెల్లించిన పన్నులకు మధ్య భారీగా తేడాలు ఉన్నట్టు గుర్తించారు. అంతేకాదు భారీగా పన్ను ఎగవేసినట్టు కూడా తేలింది. అన్విత బిల్డర్స్ కార్యాలయాల్లో భారీగా రికార్డులను సీజ్ చేశారు. జూబ్లీహిల్స్, రాయదుర్గం, చైతన్యపురి, మలక్‌పేట్, కొల్లూరులోని ఎండీ బొప్పన అచ్యుత రావు, డైరెక్టర్ బొప్పన అనూప్ ఇళ్లు, ఆఫీసుల్లో ఈ సోదాలు చేశారు అధికారులు. సింగపూర్, దుబాయ్‌లో ఇంటీరియర్ బిజినెస్ ద్వారా భారీగా ఆదాయాన్ని సంపాదించినట్టు గుర్తించారు అధికారులు. అసలు ఈ కంపెనీకి పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చాయన్న దానిపై యాజమాన్యం, డైరెక్టర్లపై ప్రశ్నల వర్షం కురిపించారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు కూడా తేల్చినట్టు తెలుస్తోంది.నిజానికి అన్విత బిల్డర్స్ చేస్తున్న ప్రాజెక్టులన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. బాచుపల్లి లో భువి రెసిడెన్సీ పేరుతో 2021లో ఓ చిన్న ప్రాజెక్ట్ చేపట్టగా, అది 2023లో పూర్తి చేసింది. తర్వాత కొల్లూరుపై కన్నేసింది. అన్వితా ఇవానా, అన్విత హై9 పేరుతో దశల వారీగా ప్రాజెక్టులు చేపట్టింది. అలాగే అన్విత అమరి, అన్విత కమర్షియల్ పేర్లతో మొత్తం 60 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టింది. ఇవన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. కానీ, ప్రీలాంచ్ పేరుతో ముందుగానే డబ్బులు వసూలు చేసింది. ఇవానా ప్రాజెక్టును 22.15 ఎకరాల్లో రెండు దశల్లో పూర్తయ్యేలా చేపట్టింది. మొదటి దశలో 12.9 ఎకరాల్లో 15 అంతస్తుల్లో రెండు టవర్ల నిర్మాణం ఉంటుందని, 2024 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని చెప్పింది. రెండో దశలో 9.25 ఎకరాల్లో 36 అంతస్తుల్లో 4 భారీ టవర్లను నిర్మిస్తామని, 2027లో దీన్ని పూర్తి చేస్తామని కస్టమర్లను నమ్మించింది. ఇది రూ.2వేల కోట్ల మెగా ప్రాజెక్ట్. ఇంత మొత్తంలో డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనేది పెద్ద ప్రశ్న. ప్రీలాంచ్ పేరుతో కొంత వసూళ్లు చేసినా, ఇంకా ఇతర ప్రాజెక్టుల్లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. త్వరలో నీలాద్రి ఫామ్స్ పేరుతో ఫామ్ ల్యాండ్ ప్రాజెక్ట్‌నూ చేపడుతున్నట్టు చెప్పింది. ఇక, సంస్థ డైరెక్టర్ బొప్పన అనూప్ అనేక కంపెనీల్లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. చిన్న వయసులోనూ ఇన్ని సంస్థల్లో కీలకంగా వ్యవహరించడంతో ఐటీ శాఖకు అనేక అనుమానాలు కలిగాయి. దీంతో సోదాలకు దిగింది. కీలక విషయాలు వెలుగుచూశాయి.

# జీవనోపాధి కోసం ల్యాప్‌టాప్

- 32 లక్షల విలువైన 25 హై-ఎండ్ పొదుపుగా ఉపయోగించిన ల్యాప్‌టాప్‌లను ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రామీణ బాలికలకు అందించారు.
- ఉపయోగించలేని పరికరాలు లాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, డెస్క్‌టాప్‌లు ఉపయోగించదగిన పరిస్థితులలో తక్కువ ఆదాయ నేపథ్యాల నుండి పిల్లలకు శక్తిని అందించడానికి తప్పనిసరిగా విరాళంగా ఇవ్వాలి, ప్యూర్ స్వచ్ఛంద సంస్థ యొక్క NRI వ్యవస్థాపకురాలు శైలా తాళ్లూరి




**జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 18 :**

THub సమీపంలోని మై హోమ్ ట్విట్జా రాయదుర్గ్‌లో ఉన్న హైదరాబాద్ ఆధారిత సాంకేతిక సేవల సంస్థ క్లారనెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, INR 32 లక్షల విలువైన 25 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను విరాళంగా ఇచ్చింది. వీటిని PURE పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ అనే స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇచ్చింది. క్లారనెట్ ఇండియా యూకే కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ యొక్క అనుబంధ సంస్థ. ఈ 25 ల్యాప్‌టాప్‌లలో పది I5 Dell Latitude 3420, మూడు I7 Dell Latitude 3420 మరియు ఆరు Lenovo ThinkPadలు, ఇతర మోడల్స్ ఉన్నాయి. ఈ ల్యాప్‌టాప్‌లు హోమ్ సర్వీస్‌తో పూర్తి వారంటీ కలిగి ఉన్నాయి. క్లారనెట్ బృందంలో సృజని చౌదరి, హెచ్‌ఆర్ హెడ్ ఇండియా, సయ్యద్ వాసే, ఫైనాన్స్ హెడ్ ఇండియా, అక్షయ్, ఇన్‌చార్జ్ ఐటి అండ్ సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ఈ వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. PURE తరపున, అరుణ దార ఇతర టీమ్ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. PURE ద్వారా ల్యాప్‌టాప్‌లు అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామీణ బాలికలకు అందించబడతాయి. ల్యాప్‌టాప్‌లు విద్యార్థులకు, ప్రత్యేకించి గ్రామీణ బాలికలకు, అందుబాటు, విద్యా కార్యకలాపాల్లో సమర్థవంతమైన భాగస్వామ్యం, మెరుగైన గ్రహణశక్తి, పనితీరు, పోర్టబిలిటీ, వశ్యత వంటి అనేక మార్గాల్లో ముఖ్యమైనవి. ముఖ్యంగా అపరిమిత ఆన్‌లైన్ వనరులు, అభ్యాస అవకాశాల యుగంలో ల్యాప్‌టాప్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. సృజనీ చౌదరి మాట్లాడుతూ.. 'ఒక నిబద్ధత కలిగిన కంపెనీగా, మేము మా సామాజిక, ఆర్థిక, పర్యావరణ సానుకూల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటాము, అటువంటి CSR కార్యక్రమాల పట్ల మక్కువ చూపుతాము అన్నారు. ఉపయోగించిన ల్యాప్‌టాప్‌లను విరాళంగా ఇవ్వడం ద్వారా మేము ఇవ్యర్థాలను తగ్గిస్తాము, ల్యాప్‌టాప్‌లను మరింత ప్రభావవంతంగా ఉపయోగిస్తాము, ఇది స్థానిక కమ్యూనిటీలకు చాలా అవసరమైన మద్దతుతో పాటు సాంకేతికతను యాక్సెస్ చేయడంలో వారికి సహాయపడుతుందని సయ్యద్ వాసే తెలిపారు. PURE అనేది స్వచ్ఛంద సేవకుల నేతృత్వంలోని సంస్థ. NRI, శైలా తాళ్లూరి, వ్యవస్థాపకురాలు CEO, PURE ద్వారా స్థాపించబడింది ఇది విద్య, షెల్టర్ హోమ్‌లు, ప్రత్యేక సహాయం, స్థానిక జనాభా, జీవనోపాధి, యువత నాయకత్వంపై దృష్టి సారిస్తుంది. ఇది భారతదేశం, USAలో పనిచేస్తుంది. ఇది ఉగాండా, ఇథియోపియా, సియెర్రా లియోన్, టాంజానియా, కెన్యా, బార్బడోస్, సెయింట్ లూసియా, ట్రినిడాడ్, టొబాగోలలో కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ప్యూర్ భారతదేశంలోని 100,000 మంది పిల్లలను, 500 ప్రభుత్వ పాఠశాలలను ప్రభావితం చేసింది, అనేక ఇతర దేశాలలో ప్రభావం చూపింది. శైలా తాళ్లూరి క్లారనెట్‌కి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని గ్రామీణ బాలికల సాధికారతలో ఇది చాలా ముందుకు సాగుతుంది. చాలా కంపెనీలు ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు లేదా డెస్క్‌టాప్‌లు వంటి ఉపయోగించని పరికరాలను ఉపయోగించగల స్థితిలో కలిగి ఉన్నాయి. అటువంటి పరికరాలు, విరాళంగా ఇస్తే, వాటిని తిరిగి ఉపయోగించుకోవచ్చు, సద్వినియోగం చేసుకోవచ్చు. ఇటువంటి పరికరాలు తక్కువ ఆదాయ నేపథ్యాల పిల్లలకు ఆన్‌లైన్ విద్యకు ఉపయోగపడతాయని శైలా చెప్పారు.

# దక్షిణాది కేంద్రంగా ప్రియాంక

**జయభేరి, బెంగళూరు, అక్టోబరు 18:**



కాంగ్రెస్ పార్టీలో వారసులు కీలక బాధ్యతలు పంచేసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఉత్తరాది బాధ్యతను రాహుల్ గాంధీ తీసుకుంటున్నారు. దక్షిణాది బాధ్యతను ప్రియాంక గాంధీ చేపట్టబోతున్నారు. కేరళలోని వయనాడ్ ఉపఎన్నికల బరిలో ఆమె నిలబడాలని నిర్ణయించుకున్నారు. పార్టీ కూడా అంగీకరించింది. ఇంత కాలం కుటుంబబాధ్యతల కారణంగా నేరుగా ఎన్నికల బరిలోకి దిగడానికి వెనుకాడుతూ వచ్చారు. వరుసగా మూడోసారి కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఇక ఆమె కూడా నేరుగా రంగంలోకి దిగాల్సిన అవసరం ఏర్పడింది. ప్రియాంక కూడా రెడీ అయ్యారు. రాజీవ్ గాంధీ కుమార్తె రూపురేఖల్లో ఇందిరాగాంధీలా ఉండే ప్రియాంకా గాంధీకి దేశవ్యాప్తంగా క్రేజ్ ఉంది. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారాలు చేస్తున్నా నేరుగా ఎన్నికల బరిలోకి ఎప్పుడూ దిగలేదు. తాజాగా వాయనాడ్ ఉప ఎన్నికల బరిలో దిగాలని ప్రియాంక నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా టిక్కెట్ ప్రకటించింది. కేరళలోని అద్భుతమైన ప్రకృతి టూరిజానికి కేంద్రమైన వాయనాడ్‌లో ముస్లింల ప్రాబల్యం అధికం. అక్కడ గత రెండు సార్లు రాహుల్ గాంధీ గెలిచారు. ఈ సారి ఆయన సోనియా ఖాళీ చేసిన రాయ్ బరేలీ నుంచి కూడా గెలవడంతో వాయనాడ్ వదులుకున్నారు. ప్రియాంక గాంధీకి రాజకీయ ఆరంగేట్రానికి అది సేఫ్ సీటుగా భావించారు. వాయనాడ్ లో ప్రియాంక గాంధీ గెలవడం పెద్ద విషయం కాదు. దేశం అంతా మిత్రపక్షాలుగా ఉన్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కేరళలో మాత్రం ప్రత్యర్థులు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ వాయనాడ్‌లో వరుసగా గెలుస్తూ వస్తోంది.

ఈ సారి ఉపఎన్నికల్లో కూడా ప్రియాంకా గాంధీనే విజయం సాధించే అవకాశం ఉంది. అయితే ఎంపీ అవడం ప్రియాంకా గాంధీకి పెద్ద విషయం కాదని.. అంతకు మించిన మిషన్‌తోనే ఆమె దక్షిణాదిలో అడుగు పెడుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వాయనాడ్ నుంచి ఎంపీగా గెలిచిన తర్వాత దక్షిణాది మొత్తం కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దుకునే ప్రయత్నాలను ఆమె చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీకి దక్షిణాది చాలా ముఖ్యం. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగోసారి ఓడిపోకుండా ఉండాలంటే కర్ణాటక, తెలంగాణలో పార్టీని చక్కదిద్దుకోవాలి. ఏపీలో వచ్చిన అవకాశాల్ని వినియోగించుకోవాలి. కర్ణాటకలో అంతర్గత కుమ్ములాటలతో ఆ పార్టీ ఇబ్బంది పడుతోంది. తెలంగాణలో అంది వచ్చిన అవకాశాన్ని నిలబెట్టకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి రావొచ్చు. కేరళలోనూ కాంగ్రెస్‌కు ఆమె స్టార్ లీడర్ గా ఉంటారు. వయనాడ్ ఎంపీ హోదాలో ఇక ప్రియాంక ఆ ప్రయత్నాలు చేస్తారని అనుకోవచ్చు. కాంగ్రెస్ మరో సారి ఢిల్లీలో అధికారంలోకి రావాలంటే ప్రియాంకా గాంధీ ప్రయత్నాలు కూడా కీలకమే.

# క్షేత్రస్థాయిలో సమాచారంపై దృష్టి కేంద్రీకరించండి

- మీరిచ్చే సమాచారంతోనే ఉన్నతాధికారుల చర్యలు ఉంటాయి
- నిరంతరం అప్రమత్తంగా ఉండాలి...
- ఎస్బీలో విధులు అంటే నిరుస్సాహం వద్దు
- స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పనితీరుపై సిపి సీవి ఆనంద్ సమీక్ష



**జయభేరి, హైదరాబాద్ :**

కమిషనరేట్ పరిధిలోని ఏడు (7) జోన్ల స్పెషల్ బ్రాంచ్ అధికాలు, సిబ్బందితో సిపి సివి ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. పోలీసు శాఖలో నిఘా విభాగము (స్పెషల్ బ్రాంచ్) ఎంతో కీలకమైందన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ,క్షేత్రస్థాయిలో సమాచారం సేకరణపై దృష్టి సారించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి ఇవ్వడం వల్లనే ఇన్‌స్పెక్టర్ ఉన్నత స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది అని తెలిపారు. హైదరాబాద్ సీటీ పోలీసుకు స్పెషల్ బ్రాంచి విభాగము ఒక ముఖ్యమైన ఒక స్థంభం లాంటిదన్నారు. స్పెషల్ బ్రాంచిలో విధులు అంటే కొందరు పనిష్మెంట్‌గా భావిస్తుంటారని, ఆవిధంగా ఏ మాత్రం అనుకోవద్దన్నారు. ఇక్కడ పనిచేసినంత కాలం అంకితభావంతో పనిచేయాలని, మీ సర్వీసులో ఇందులో పనిచేసిన అనుభవము ఏంతో ఉపయోగపడుతుంది అని పోలీసు కమిషనర్ తెలిపారు. స్థానిక ప్రజలు, పెద్దలు, నాయకులతో నిరంతరం సత్సంబంధాలు కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. అలా ఉంటేనే నిరంతరం సమాచారం పొందగలుగుతామని అన్నారు. ఎక్కడ ఏ చిన్న సమాచారము వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా తక్షణం ఉన్నతాధికారులకు చేరవేయాలని సూచించారు. ఎస్బీ సిబ్బంది, అధికారులు తమకు వచ్చే సమాచారం ఎక్కడి నుంచి వస్తుందనేది ఎప్పుడు కూడా బహిర్గతం చేయవద్దని, సోర్స్‌ను కాపాడుకుంటేనే మరింత ఎక్కువ సమాచారం, ఎక్కువ కాలంపాటు ఉంటుంది మరియు వస్తుందని తెలిపారు.

# ఏం చేయాకున్నా కుక్కను కొట్టినట్లు కొట్టారు

**జయభేరి, హైదరాబాద్ :**

ఓయూ పోలీసులు నా దగ్గరికి వచ్చి పోలీస్ స్టేషన్ కి రావాలని పిలిచారు. ఎలాంటి నోటీసు లేకుండా నన్ను ఎందుకు పోలీస్ స్టేషన్ పిలుస్తున్నారని అడిగానని బాధితుడు సందీప్ రెడ్డి అన్నారు. నా భార్య ప్రెగ్నెంట్ కావడంతో హాస్పిటల్ కి వెళ్తున్నాను అని చెప్పాను.. లేదు ఇప్పుడే రావాలంటే పోలీసులు చెప్పారు. మా భార్యను ఇంట్లో దింపేసి పోలీసుల వెంబడి పోలీస్ స్టేషన్ కి వచ్చాను. పోలీస్ స్టేషన్ వచ్చాక ఓయు సిఐ చాలా అసభ్య పదజాలంతో మాట్లాడాడు. అలా ఎందుకు మాట్లాడుతున్నారని అడిగినందుకు నాపై దాడి చేశారు. 15 మంది పోలీసులు కలిసి కుక్కను కొట్టినట్టు నన్ను నా తమ్ముళ్లు ఇద్దరిని కొట్టారు. ఎందుకు తీసుకొచ్చారు రీసన్ చెప్పలేదు. పోలీసులు తప్పయింది అని చెప్పి మళ్ళీ ఇంటికి పంపిస్తున్నారు. అసలు నాపై ఎలాంటి ఫిర్యాదు రాకుండానే పోలీస్ స్టేషన్ పిలిచి కొట్టారు. నన్ను కొట్టిన పోలీసులపై అడిషనల్ డీసీపీ నరసయ్యకు ఫిర్యాదు చేశాను. వాళ్లపై చర్యలు తీసుకోకుంటే డీజీపీ వరకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని అన్నారు.



## మిస్ ఇండియా 2024గా టీవీ యాంకర్ నికితా పోర్వాల్

# ఇంతకీ నికితా ఎవరు?

- మిస్ ఇండియా 2024గా నికితా పోర్వాల్ గెలిచింది. ఆమె భారతదేశం తరపున మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనబోతోంది.

మిస్ ఇండియా 2024 కిరీటాన్ని నికిత పోర్వాల్ గెలుచుకుంది. మన దేశం తరపున త్వరలో మిస్ వరల్డ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించబోతోంది. ఈమె మధ్యప్రదేశ్‌కు చెందిన అమ్మాయి నికితా. ఈమెకు మిస్ ఇండియా 2023 విజేత నందిని గుప్తా కిరీటాన్ని పెట్టింది. నికిత గురించి ఇంతకు ముందు ఎవరికీ తెలియదు, ఇప్పుడు మిస్ ఇండియాగా గెలవడంతో నికితా పోర్వాల్ ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చింది. ఈ అమ్మాయి ఎవరో తెలుసుకునేందుకు నెటిజెన్లు ఎంతో ఆసక్తిని చూపిస్తున్నారు. ప్రస్తుతానికి నికితా గురించి చాలా తక్కువ సమాచారమే ఇంటర్నెట్లో అందుబాటులో ఉంది.

**నికితా పోర్వాల్ ఎవరు?**

నికిత పోర్వాల్ మధ్యప్రదేశ్లోని ఉజ్జయిని ప్రాంతానికి చెందిన అమ్మాయి. అక్కడే కార్మెల్ కాన్వెంట్ సీనియర్ సెకండరీ స్కూల్లో చదువుకుంది. ప్రస్తుతం బరోడాలోని మహారాజా షాయాజీరావు విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది.

**నాటకాల్లో టాప్**

ఆమె 18 ఏళ్ల వయసులోనే తన కెరీర్‌ను ప్రారంభించింది. మొదట టీవీ యాంకర్‌గా ఆమెకు అవకాశం వచ్చింది. తరువాత చిన్న చిన్న సినిమాల్లో నటించడం మొదలుపెట్టింది. ఆమె చేసిన ఒక చిత్రం అంతర్జాతీయ ఉత్సవాల్లో కూడా ప్రదర్శించారు. ఇది ఇంకా మన దేశంలో విడుదల కాలేదు. త్వరలో విడుదలవుతుందని తెలుస్తోంది. ఆమె థియేటర్ ఆర్టిస్టు కూడా. అరవైకి పైగా నాటకాల్లో ఈమె నటించింది. కథలు చెప్పడం అంటే ఆమెకి ఎంతో ఇష్టం. నాటకాలను కూడా ఎంతో ఇష్టంగా రాస్తుంది. 'కృష్ణ లీల' అని పిలిచే నాటకాన్ని ఆమె రాసింది. ఈ నాటకం 250 పేజీలు ఉంటుంది. నికితకు ఐశ్వర్యారాయ్ అంటే ఎంతో ఇష్టం. ఆమెనుతన ఆరాధ్య దైవంగా చెబుతుంది. ఐశ్వర్య అందం, తెలివితేటలు తనని ఎంతో ఆకర్షించాయని వివరిస్తోంది. అందంతో పాటు తెలివితేటలు కలిగి ఉండడం ఎంతో అదృమని అంటోంది నికితా.

ఈ మిస్ ఇండియా పోటీలు అక్టోబర్ 16న ముంబైలోని ఫేమస్ స్టూడియోలో నిర్వహించారు. ప్రతి భారతీయ రాష్ట్రం నుంచి 30 మంది పోటీదారులు పాల్గొన్నారు. నికిత మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో రేఖ పాండాయ్ నిలిచింది. ఇక మూడో స్థానంలో గుజరాత్ కు చెందిన ఆయుషి ధోలాకియా నిలిచింది. మిస్ ఇండియా పోటీల్లో భారతదేశంలో జరిగే ఒక జాతీయ స్థాయి అందాల పోటీ. ఇందులో గెలిచిన విజేత మిస్ వరల్డ్ పోటీకి అర్హురాలు అవుతుంది. టైమ్స్ గ్రూప్ ప్రచురించే ఫెమీనా పత్రికా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయి. మిస్ ఇండియా విజేత మిస్ వరల్డ్ పోటీలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆమె భారతీయ అందాన్ని, సంస్కృతిని, విలువలను విదేశాలకు తీసుకెళ్లే రాయబారిగా వ్యవహరిస్తుంది.





# భారత్ పోరాటమే శరణ్యం

- కోహ్లీ, సర్ఫరాజ్, రోహిత్ అర్ధ శతకాలు
- తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ భారీ స్కోరు
- రచిన్ రవీంద్ర సెంచరీ

**బెంగళూరు:**

న్యూజిలాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బాధ్యాతారాహిత్యమైన ఆటతీరుతో 46 పరుగులకే ఆలౌట్ అయిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం దూకుడుగా ఆడుతోంది. టాపార్డర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ (102 బంతుల్లో 70, 8 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (78 బంతుల్లో 70 నాటౌట్, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), సారథి రోహిత్ శర్మ (63 బంతుల్లో 52, 8 ఫోర్లు, 1 సిక్స్) కివీస్ బౌలింగ్‌పై కౌంటర్ ఎటాక్‌కు దిగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమ్ఇండియా 49 ఓవర్లలోనే 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. ఓవర్‌కు 4.7 సగటుతో పరుగులు రాబట్టిన రోహిత్ సేన.. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు కంటే ఇంకా 125 పరుగులు వెనుకంజలోనే ఉంది. అంతకముందు న్యూజిలాండ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 402 పరుగుల స్కోరు చేయడంతో ఆ జట్టుకు 356 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. రచిన్ రవీంద్ర (157 బంతుల్లో 134, 13 ఫోర్లు, 4 సిక్సర్లు), టిమ్ సౌథీ (73 బంతుల్లో 65, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) ధాటిగా ఆడి పర్యాటక జట్టుకు భారీ ఆధిక్యాన్ని అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ పేసర్ల ధాటికి బెంబేలెత్తిన భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం నిలబడ్డారు. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (35), రోహిత్ కలిసి తొలి వికెట్‌కు 72 పరుగుల శుభారంభాన్ని అందించారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో ఈ ఇద్దరూ స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. కానీ అజాజ్ పటేల్ వేసిన 18వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయిన జైస్వాల్.. స్టంపౌట్ అయి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. హెన్రీ 21వ ఓవర్లో 4, 6, 4తో 59 బంతుల్లోనే హిట్‌మ్యాన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ మరుసటి ఓవర్లోనే అజాజ్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడినా అది కాస్తా వికెట్లను పడగొట్టడంతో రోహిత్ నిరాశగా మైదానాన్ని వీడాడు.

ఈ క్రమంలో కోహ్లీకి జతకలిసిన సర్ఫరాజ్.. ఆరంభం నుంచే కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అజాజ్, ఓరూర్కీ బౌలింగ్‌లో చూడచక్కని షాట్లతో బంతిని బౌండరీ లైన్ దాటించాడు. సర్ఫరాజ్ దూకుడుతో కోహ్లీ కూడా బ్యాట్‌కు పనిచెప్పాడు. అజాజ్ 30వ ఓవర్లో 6, 4, 4 బాదాడు. అతడే వేసిన 32వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో అభిమానులను అలరించాడు. ఇదే ఊపులో 42 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. టెస్టులలో అతడు ఆడిన 8 ఇన్నింగ్స్‌లలో ఇది నాలుగో అర్ధ శతకం కావడం విశేషం. కొద్ది సేపటికే కోహ్లీ సైతం ఈ ఏడాది టెస్టులలో తొలి అర్ధ శతకాన్ని సాధించాడు. ఈ ఇద్దరూ వంద బంతుల్లోనే శతక భాగస్వామ్యాన్ని పూర్తిచేశారు. మూడో రోజు ఆట ముగుస్తుందనగా గ్లెన్ ఫిలిప్స్ వేసిన 49వ ఓవర్లో ఆఖరి బంతి కోహ్లీ బ్యాట్‌ను ముద్దాడుతూ వెళ్లి కీపర్ బ్లండెల్ చేతిలో పడటంతో భారత్‌కు భారీ షాక్ తగిలింది. సర్ఫరాజ్‌కోహ్లీ కలిసి మూడో వికెట్‌కు 136 రన్స్ జోడించారు.

మూడో రోజు 180/3 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద బ్యాటింగ్‌కు వచ్చిన కివీస్ ఆరంభ ఓవర్లలోనే కీలక వికెట్లు కోల్పోయింది. మిచెల్ (18)ను సిరాజ్ ఔట్ చేయగా బ్లండెల్ (5)ను బుమ్రా వెనక్కి పంపాడు. ఫిలిప్స్ (14), హెన్రీ (8) వికెట్లు జడ్డూ ఖాతాలోకి వెళ్లాయి. కానీ సౌథీతో కలిసి కివీస్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఈ ఇద్దరూ వన్డే తరహా ఆట ఆడారు. ఈ భాగస్వామ్యాన్ని విడదీయడానికి రోహిత్ పదే పదే బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. లంచ్ విరామానికి ముందే తన కెరీర్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్న రచిన్.. ఆ తర్వాత జోరు పెంచాడు. మరో ఎండ్‌లో సౌథీ కూడా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. హాఫ్ సెంచరీ తర్వాత సౌథీ నిష్క్రమించడంతో 134 పరుగుల 8వ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రచిన్‌ను కుల్‌దీప్ ఔట్ చేయడంతో కివీస్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. పరుగుల యంత్రం కోహ్లీ ఈ మ్యాచ్‌లో అర్ధ శతకం సాధించడంతో టెస్టులలో 9వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. వ్యక్తిగత స్కోరు 53 పరుగుల వద్దకు చేరుకోగానే అతడు ఈ ఘనతను అందుకున్నాడు. తద్వారా భారత్ తరపున ఈ ఘనత సాధించిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. సచిన్ (15,921), ద్రావిడ్ (13,265), గవాస్కర్ (10,122) కోహ్లీ కంటే ముందున్నారు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 46 ఆలౌట్
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 402 ఆలౌట్ (రచిన్ 134, కాన్వే 91, జడేజా 3/72, కుల్‌దీప్ 3/99),
భారత్ రెండో ఇన్నింగ్స్: 231/3 (కోహ్లీ 70, సర్ఫరాజ్ 70 నాటౌట్, అజాజ్ 2/70)

మూడో రోజు ఆటలో నమోదైన పరుగులు. టెస్టులలో ఒక రోజు ఆటలో ఇన్ని పరుగులు చేయడం భారత్‌లో ఇది రెండోసారి. 2009లో శ్రీలంక, భారత్ కలిసి 470 పరుగులు చేయడమే ఇప్పటివరకూ అత్యుత్తమం.



# భార్య దగ్గర భర్త దాచే సీక్రెట్స్

- చాలా మంది భార్యలు మా ఆయన నాకు అన్నీ చెప్పేస్తుంటారు అని సంబరపడిపోతుంటారు. కానీ.. కొన్ని సీక్రెట్స్ మాత్రం భార్యలకి చెప్పడానికి భర్తలు ఇష్టపడరట.

కాపురం సజావుగా సాగిపోవాలంటే భార్యాభర్తల మధ్య దాపరికాలు ఉండకూడదని పెద్దవాళ్లు చెప్తుంటారు. కానీ.. చాలా మంది భర్తలు తమ భార్యల దగ్గర కొన్ని విషయాలు మాత్రం దాస్తుంటారని మానసిక నిపుణులు చెప్తున్నారు. భార్య కోప్పడుతుందనే భయం లేదా అర్థం చేసుకోదేమో అనే ఆందోళన ఇలా కారణాలు ఏవైనా కావొచ్చు. కానీ భర్తలు మాత్రం చాలా విషయాల్ని భార్యల దగ్గర దాస్తారనేది మాత్రం నిజం.

**మహిళలతో ఛాటింగ్**

ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిపోవడంతో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్ ఎక్కువ అయిపోయాయి. కొంతమంది భర్తలు తమ భార్యలకి తెలియకుండా ఇతర మహిళలతో ఛాటింగ్, వీడియో కాల్స్, ఇమేజ్‌లు షేర్ చేయడం లాంటివి చేస్తుంటారు. వాస్తవానికి ఇవి అక్రమ సంబంధాలు అంతటి తీవ్రం కాకపోయినా.. ఎమోషనల్‌గా భార్యని మోసం చేసినట్లే. ఈ విషయాల్ని భార్యలకి తెలియకుండా భర్తలు జాగ్రత్తపడుతుంటారు.

**అలవాట్లు లేదా వ్యసనాలు**

కొంతమంది భర్తలు గేమింగ్, మద్యపానం, సిగరెట్ లేదా వేరే వ్యసనాలకు అలవాటు పడతారు. ఈ అలవాట్లు పెరుగుతున్నప్పుడు వాటి గురించి భార్యకు తెలియకుండా జాగ్రత్తపడుతుంటారు. ఆ వ్యసనం కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతున్నా భార్యకి మాత్రం చెప్పడానికి భర్తలు ఇష్టపడరు.

**జీతం, జాబ్ సెక్యూరిటీ**

కొందరు భర్తలు తమ ఉద్యోగం, జీతం లేదా ఉద్యోగ భద్రత తదితర విషయాల్ని భార్యకు చెప్పకుండా దాచిపెడతారు. ఉదాహరణకు ఉద్యోగం కోల్పోయే ప్రమాదం వచ్చినప్పుడు లేదా అప్పులు ఎక్కువగా పెరిగినప్పుడు కూడా అవి భార్యకు తెలియనీయకుండా భర్తలు జాగ్రత్తపడుతుంటారు. అలానే తాము అతిగా ఖర్చు చేస్తున్న విషయాల్ని కూడా భార్యలకి చాలా మంది భర్తలు చెప్పరు.

**బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్స్**

కొంత మంది భర్తలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం భార్యకు తెలియకుండా నిర్ణయాలు తీసుకుంటారు. చివరికి కుటుంబానికి సంబంధించిన కీలక నిర్ణయాల్లోనూ భార్యతో చర్చించకపోవడం.. ఏకపక్షంగా నిర్ణయాలు తీసేసుకుంటారు. భార్యకి ఏమీ తెలియదనే అహం లేదా చెప్తే అడ్డుపడుతుందనే భయం ఇలా కారణం ఏదైనా కావొచ్చు. వ్యాపార, పెట్టుబడి నిర్ణయాలు భార్యకి తెలియకుండానే చాలా మంది భర్తలు తీసేసుకుంటున్నారు. ఆ తర్వాత నష్టాలు వచ్చాక పశ్చాతాపం వ్యక్తం చేస్తుంటారు.

**ఫ్రెండ్స్ గురించి**


కొంత మంది భర్తలు భార్యకు తెలియనీయకుండా వేరే మహిళలతో స్నేహం కొనసాగిస్తారు. అది ఫ్రెండ్‌షిప్ మాత్రమే అయినా.. భార్య అనుమానిస్తుందేమో అనే భయంతో స్నేహితురాళ్ల గురించి భార్యకి చెప్పడానికి భర్తలు ఇష్టపడరు. ఆఖరికి దొరికిపోయే వరకూ భార్య దగ్గర గోప్యంగానే కొంత మంది భర్తలు ఉంచుతారు. చాలా మంది భర్తలు తమ ఫ్రెండ్స్‌తో కలిసే విషయాన్ని కూడా దాచేస్తుంటారు.

**అక్రమ సంబంధాలు**

కొంత మంది భర్తలు శారీరక ఆకర్షణ వల్ల ఇతర మహిళలతో సంబంధాలను కొనసాగిస్తారు. పెళ్లి జీవితంలో శారీరక సంతృప్తి లేకపోతే అది అక్రమ సంబంధాలకి దారితీస్తుంది. ఈ విషయాల్ని భర్తలు అస్సలు భార్యకి చెప్పరు. భార్యకి అనుమానం వచ్చి ప్రశ్నించినా సరే సమాధానం దాట వేయడానికే ప్రయత్నిస్తారు తప్ప.. బంధాన్ని బహిర్గతం చేయరు.

**అర్ధాంగిగా ఎలా తెలుసుకోవాలి?**

మానసిక నిపుణులు ఏం చెప్తున్నారంటే.. భర్త అలవాట్లు, పోకడలపై భార్య నిత్యం ఓ కన్నేసి ఉంచాలి. అలా అని ప్రతి విషయాన్ని అనుమానంతో చూడకూడదు. అలానే భర్త అభిప్రాయాలని గౌరవం ఇస్తూనే అతను స్వేచ్ఛగా ఏ విషయాన్నైనా మీ దగ్గర షేర్ చేసుకునే పరిస్థితిని కల్పించాలి. విషయం ఏదైనా భార్యకి చెప్తే ఆమె అర్థం చేసుకుంటుందని భర్తకి అనిపిస్తే తప్పకుండా చెప్తారు. కానీ.. చాదస్తం, అనుమానంతో భర్త చెప్పే ప్రతి విషయంలోనూ తప్పులు వెతుకుతూ వెళ్తే.. మీ దగ్గర దాచే విషయాల సంఖ్య పెరిగిపోతూ ఉంటుంది.




# విశ్వక్‌సేన్‌తో ఆటపాట

మంగళూరు సోయగం కృతిశెట్టికి అవకాశాలైతే వస్తున్నాయి కానీ.. ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కడం లేదు. ఏడాదికాలంగా తెలుగు ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న ఈ అమ్మడు ఇక్కడ భారీ అవకాశం కోసం ఎదురుచూస్తున్నది. తాజా సమాచారం ప్రకారం కృతిశెట్టి టాలీవుడ్‌లో బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. యువ హీరో విశ్వక్‌సేన్‌తో జోడీ కట్టబోతున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వంలో విశ్వక్‌సేన్ ఓ చిత్రాన్ని చేయబోతున్నాడు. 'వీఎస్ 14' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా తాలూకు అనౌన్స్‌మెంట్ ఆగస్ట్‌లో వెలువడింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో కృతిశెట్టిని కథానాయికగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని, త్వరలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని నాన్‌స్టాప్ వినోదంతో ఆకట్టుకుంటుందని మేకర్స్ అంటున్నారు. ప్రస్తుతం కృతిశెట్టి తమిళంలో మూడు చిత్రాలతో బిజీగా ఉంది.



# అలాంటి వ్యక్తినే ఇష్టపడతా

కాబోయే భర్త ఎలా ఉండాలి? తనకు ఎలాంటి గుణగణాలుండాలి? అనే విషయాలపై క్లారిటీ ఇచ్చింది చెన్నయ్ చందమామ శ్రుతిహాసన్. తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'శారీరకంగా స్ట్రాంగ్‌గా ఉండటం ముఖ్యం కాదు. మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. అదీ ముఖ్యం. సృజనాత్మక భావాలు, స్ఫూర్తినింపే ఆలోచనలు మనిషికి ఆభరణాలు. ఈ లక్షణాలున్న వ్యక్తి తారసపడితే, తనకూ నేను నచ్చితే.. తప్పకుండా పెళ్లాడతా. ఆదర్శవంతమైన భాగస్వామి ఎప్పుడూ నవ్విస్తూ సరదాగా ఉంటాడు. నేను అలాంటి వ్యక్తినే ఇష్టపడతా' అని చెప్పుకొచ్చింది శ్రుతి హాసన్. ఇదే ఇంటర్వ్యూలో 'మీరు సింగలా.. రిలేషన్‌లో ఉన్నారా?' అనడిగితే.. 'ఇలాంటి ప్రశ్నలు నాకు నచ్చవ్. కానీ సమాధానం చెబుతా. నేను సింగిలే. ప్రస్తుతానికి నా రిలేషన్ కెరీర్‌తోనే' అని తెలిపింది శ్రుతి హాసన్. దిల్లీకి చెందిన ప్రముఖ డూడుల్ ఆర్టిస్ట్ శాంతను హజారికతో ప్రేమలో ఉన్నట్టు నాలుగేళ్ల క్రితం ప్రకటించిన శ్రుతిహాసన్.. ఇటీవలే అతనితో విడిపోయింది. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ తన ఇన్‌స్టాలో పోస్ట్ కూడా పెట్టింది. ఈ నేపథ్యంలో ఈ ఇంటర్వ్యూలో చెప్పిన సమాధానాలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# లొకేషన్‌లోనే చనిపోవాలి

'23ఏళ్లకే నటుడ్నయ్యాను. 27ఏళ్లకు హీరోని అయ్యాను. నటుడిగా 36ఏళ్ల ప్రయాణం నాది. దేవుడు అద్భుతమైన జీవితాన్నిచ్చాడు. కోట్లాది అభిమానులను ఇచ్చాడు. సంపదను కూడా కావాల్సినదానికంటే ఎక్కువే ఇచ్చాడు. ఇక నా ఒకే ఒక కోరిక మిగిలివుంది. లొకేషన్‌లో నటిస్తూ చనిపోవాలి. అదే నా ఆఖరి కోరిక.' అన్నారు బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్‌ఖాన్.

లోకర్నో ఫిల్మ్ ఫెస్టివెల్‌లో భాగంగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పై విధంగా స్పందించారు. ఇంకా మాట్లాడుతూ 'జీవితాంతం నటుడిగానే కొనసాగాలనుకుంటున్నా. ఏదైనా సినిమా సెట్‌లో దర్శకుడు 'యాక్షన్' చెప్పగానే నేను చనిపోవాలి. వాళ్లు 'కట్' చెప్పాక కూడా లేవకూడదు.' అంటూ నవ్వుతూ చెప్పారు షారుక్. సినీ రంగానికి చేస్తున్న సేవలకు గాను లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో షారుక్‌కు జీవిత సాఫల్య పురస్కారం అందించారు. ఈ గౌరవాన్ని సంతోషంగా స్వీకరిస్తున్నాని ఈ సందర్భంగా షారుక్ అన్నారు.

# గేమ్‌చేంజర్ రాజకీయ చదరంగం

రామ్‌చరణ్, శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'గేమ్‌చేంజర్' సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంక్రాంతికి సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్‌ని కొత్త పుంతలు తొక్కించనున్నారు దిల్‌రాజు. ఇప్పటివరకూ పాటలే తప్ప 'గేమ్‌చేంజర్'కి సంబంధించిన ట్రైలర్, టీజర్ విడుదల కాలేదు. అందుకే త్వరలో ఈ సినిమా టీజర్‌కి ప్లాన్ చేశారు దిల్‌రాజు. టీజర్ కట్ చేయడం కూడా పూర్తయిందని సమాచారం. మంచి ముహూర్తం చూసి త్వరలో టీజర్‌ని విడుదల చేయనున్నారు. శంకర్ బ్లాక్‌బస్టర్స్ భారతీయుడు, ఒకేఒక్కడు తరహాలో సామాజిక సమస్యల నేపథ్యంలో 'గేమ్‌చేంజర్' కథ కూడా సాగుతుందని సమాచారం. సమాజంలోని ప్రతి ఒక్కరికీ రాజ్యాంగంపై, పాలనా వ్యవస్థపై అవగాహన కలిగించేలా ఈ సినిమాలో సన్నివేశాలుంటాయని, బంధాలు, భావోద్వేగాలు, వెన్నుపోటు రాజకీయాలు, పగ, ప్రతీకారాల నేపథ్యంలో సినిమా ఉంటుందని వినికిడి. రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో అంజలి, కియారా అద్వానీ కథానాయికలు. శ్రీకాంత్, ఎస్.జె. సూర్య, సముద్రఖని, సునీల్ తదితరులు ఇతరపాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: ఎస్.ఎస్.థమన్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com